**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 79, పేజీలు - 08
గురువారం, సెప్టెంబర్ 17, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## కేసీఆర్ ఫాంహౌస్
# భూములపై విచారణ
### - సీఎం రేవంత్ ఆదేశాలు.. 30 రోజుల డెడ్‌లైన్

- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ
- నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన
- కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిధిలోని భూములపై సమగ్ర విచారణకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలు జారీ చేశారు.

వందల ఎకరాల ప్రభుత్వ భూమి కేసీఆర్ ఫామ్‌హౌస్ ఆధీనంలో ఉందనే ఆరోపణలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు సభలో స్పష్టం చేశారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సరిహద్దులు, ఆక్రమణలపై 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. నిబంధనల ప్రకారం మాజీ సీఎం కేసీఆర్‌కు తక్షణమే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. నిర్ణీత సమయంలోగా విచారణ పూర్తి చేయడంలో ఏమైనా నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులైన అధికారులు, సంబంధిత మంత్రులపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 2లో..

## చైనా వ్యూహాలు..
# దాయాది అమలు
### - భారత యుద్ధ నౌకను ఢీకొట్టిన పాకిస్థాన్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అరేబియా సముద్రంలో మంగళవారం సాయంత్రం పాకిస్థాన్ నేవీ భారత యుద్ధనౌకను ఢీకొట్టింది. నిత్య విధుల్లో ఉన్న భారత నౌక వైపు పాక్ నౌక అత్యంత వేగంగా, ప్రమాదకర రీతిలో దూసుకొచ్చి ఢీకొట్టిందని భారత నౌకాదళ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగనప్పటికీ ఇరు దేశాల మధ్య ఉన్న విశ్వాస పునరుద్ధరణ చర్యలకు ఇది పూర్తి విరుద్ధమని భారత్ పేర్కొంది. ఈ ఉల్లంఘనపై న్యూఢిల్లీలోని పాక్ దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేయగా, ఇస్లామాబాద్‌లోనూ 2లో..

## సెమీకండక్టర్ రంగానికి
# రెడ్ కార్పెట్
### - సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధనవాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ప్రత్యేకంగా భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో సెమీ కండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సింగపూర్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు గల అనుకూలతలను, ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను సీఎం రేవంత్ వారికి సమగ్రంగా వివరించారు.

**మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలు**

రాష్ట్రంలో చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవనం, 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి ప్రణాళికల గురించి సీఎం రేవంత్ రెడ్డి సింగపూర్ బృందానికి వివరించారు. తొలిదశలో 2లో..


## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు
### - ఆ ఆదేశాలు ఎవరిచ్చారన్న జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో 2లో..

# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు.?
### - ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని అన్ని రంగాలను, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు చేరాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన 236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో చాలా వెనకబడి ఉన్నాయని, లక్ష్యాలను చేరుకుంటేనే ఎస్ఎల్‌బీసీ సమావేశానికి అర్థం ఉంటుందని సీఎం అన్నారు. వ్యవసాయ రుణాలు సహా వివిధ వర్గాలకు బ్యాంకులు అందించే సేవలపై సీఎం సమీక్షించారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావించిన 2లో..

# హైదరాబాద్‌లో
## భూగర్భ జలాల డేంజర్ బెల్స్
### - భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల 2లో..

## ఓటుకు నోటు కేసులో
# రేవంత్ వాదనలు పూర్తి
### - అవినీతి నిరోధక చట్టం వర్తించదన్న రేవంత్ తరపు లాయర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టు తాజాగా విచారణ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సహా జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా కూడా ఉన్నారు. తమపై నమోదైన ఏసీబీ కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తమ పిటిషన్లలో కోరారు. ఈ వ్యవహారం ఎన్నికలకు సంబంధించినదని దీనిపై అవినీతి నిరోధక చట్టం కింద 2లో..

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా
# ప్రభుత్వానికే అప్పగిస్తా

- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తమ భూముల గురించి చేసిన ప్రకటనపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. తనకు ఎలాంటి అక్రమ ఆస్తులు లేవు అని క్లారిటీ ఇచ్చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తాను ప్రస్తావించిన తన ఆస్తులకన్నా గజం భూమి ఎక్కువగా ఉన్నా ఆ భూమిని ప్రభుత్వానికే సరెండర్ చేస్తాను అని ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 2లో..


## నీ ఆస్తులు.. మా ఆస్తులపై
# సిట్టింగ్ జడ్జీతో ఎంక్వైరీకి సిద్ధం
### - నువ్వు రెడీనా అంటూ రేవంత్ పై హరీష్ రావు ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చర్చ ద్వారా 22ఏకు ఒక క్లారిటీ వస్తదేమో అని అనుకున్నాం కానీ రేవంత్ రెడ్డి యూఎల్‌సీ భూముల మీద న్యూ పాలసీ గైడ్ లైన్స్ ఇస్తా అంటడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఎండీఏ, డీటీసీపీ లే అవుట్లు ఓ వారం రోజుల్లోపు వ్యవస్థ తెస్తం, జిల్లా స్థాయిలో కమిటీ వేస్తం. జీవో 118 ఎల్‌బీ నగర్ దానిపై పరిశీలిస్తాం. ఆలోచిస్తం, లీగల్‌గా పరిష్కరిస్తాం. విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతం. ఫీజులు కట్టించుకుంటం, గైడ్ లైన్స్ ఇస్తం, హైపవర్ కమిటీ వేస్తం, ఇవే చెప్పిండు. నీ ఇల్లు మాత్రం తీసుకున్నవ్, నీ ఇల్లుకు ఏ హైపవర్ కమిటీ లేదు, లీగల్‌గా ఆలోచించేది లేదు. కమిటీ వేసేది లేదు, పరిష్కరించేది లేదు. 2లో..

# రూ. 2000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు
### - వెనక్కి తీసుకోబోమన్న కేంద్రం

- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి
- ఈ ఛార్జీలు వ్యాపారులకు మాత్రమే, కస్టమర్లపై భారం లేదని స్పష్టీకరణ
- యూపీఐ వ్యవస్థను నిలబెట్టేందుకే ఈ నిర్ణయమని ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) విధించే నిర్ణయంపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నూతన విధానం 2026 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తుందని, దీనిపై పునరాలోచన చేసే ఉద్దేశం లేదని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. అయితే, ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే వర్తిస్తాయని, యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిపే నగదు బదిలీలు (పీ2పీ) ఎప్పటిలాగే ఉచితంగానే కొనసాగుతాయి. అలాగే, క్యూఆర్ కోడ్‌ల ద్వారా 2లో..

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ

### ధరణి, ఉద్యమం పేరుతో ఆస్తుల కూడబెట్టుడుపై విమర్శలు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ భారీగా ఆస్తులను కూడబెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ కల్వకుంట్ల కుటుంబానికి వివిధ ప్రాంతాల్లో సుమారు 440 ఎకరాల భూమి ఉందని, కేసీఆర్ దంపతులు, కేటీఆర్ కుటుంబసభ్యుల పేరు మీద ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల స్థిరాస్తులు ఉన్నాయో సీఎం సర్వే నంబర్లతో సహా సభలో వెల్లడించారు. నిబంధనల ప్రకారం 27 ఎకరాలు మాత్రమే ఉండాల్సిన కేసీఆర్ దంపతులకు 67 ఎకరాల భూమి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### ప్రభుత్వ భూమి అని తేలితే పేదలకు పంపిణీ

కేసీఆర్ ఫామ్‌హౌస్ ఆధీనంలో సుమారు 700 ఎకరాల వరకు విస్తరించి ఉందని, అందులో దాదాపు 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనే ఆరోపణలు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఫామ్‌హౌస్ భూమి వెనుక ఉన్న అసలు కథేంటో తేల్చాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అధికారుల దర్యాప్తులో కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా తేలితే, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆ భూమిని ఎర్రవెల్లి ఫాం హౌస్ వద్ద నిరసన తెలిపిన దళితులకు, పేదలకు పంచుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదల హక్కులను కాపాడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం పేర్కొన్నారు.

### ప్రతిపక్ష నేతలపై భూక్రమణ ఆరోపణలు

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు భూ అక్రమాలు చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఇనాం భూములను తన పేరు మీదకు మార్చుకున్నారని పేర్కొన్నారు. రోహిన్ రెడ్డి అసైన్డ్ భూముల్లో ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం కేటాయించిన భూములతో పాటు ఎల్బీనగర్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, గంగుల కమలాకర్ వంటి నేతలు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కొల్లగొట్టారని ధ్వజమెత్తారు.

### భూదాన్ భూములపై రాజకీయంపై రేవంత్ విమర్శలు

రాష్ట్రంలో 74 ఎకరాల భూదాన్ భూములపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గతంలో తీవ్రంగా పోరాటం చేశారని, కానీ ప్రస్తుతం ఆ భూములు అన్యాక్రాంతమైపోయాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. సీఎల్పీ నాయకుడిగా ఉన్న ఒక దళితుడికి అన్యాయం చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరి మంత్రి పదవులు అనుభవించారని, దొరల వద్ద బానిసలుగా ఉండాలనుకుంటే ఉండవచ్చని ఘాటుగా వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి సొంత గ్రామంలోని ఆక్రమణకు గురైన భూములపై విచారణ జరిపించాలని ముందుగా సబితా ఇంద్రారెడ్డి కోరాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# చైనా వ్యూహాలు.. దాయాది అమలు

భారత్ నిరసన వ్యక్తం చేసింది. 2011లో పాక్ నౌక 'పిఎన్ఎస్ బాబర్' భారత నౌకను ఢీకొట్టిన తర్వాత మళ్లీ అలాంటి ఘటన జరగడం ఇదే తొలిసారి.

### సముద్రంలో 'ర్యామింగ్' వ్యూహం

సముద్రంలో మరొక నౌకను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టే 'ర్యామింగ్' అనేది ప్రాచీన రోమన్లు, గ్రీకుల కాలం నుంచీ ఉన్న వ్యూహం. 1862 అమెరికా సివిల్ వార్‌తో పాటు మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలలో కూడా ఈ వ్యూహాన్ని విస్తృతంగా ఉపయోగించారు. అప్పట్లో జాన్ ఎఫ్ కెన్నడీ (తర్వాతి కాలంలో అమెరికా అధ్యక్షుడు) నేతృత్వంలోని పీటీ–109 నౌక కూడా ఇలాంటి దాడిలోనే మునిగిపోయింది. అట్లాంటిక్ సముద్రంలో చేపల వేట హక్కుల కోసం జరిగిన 'కోడ్ వార్స్'లోనూ ఇరు దేశాల నౌకలు పరస్పరం ఢీకొట్టుకున్నాయి.

### చైనా 'గ్రే-జోన్' వ్యూహం పాకిస్థాన్ అమలు

దక్షిణ చైనా సముద్రంలో చైనా ఉపయోగిస్తున్న 'గ్రే–జోన్' యుద్ధ వ్యూహాలనే ఇప్పుడు పాకిస్థాన్ అరేబియా సముద్రంలో ప్రయోగిస్తోంది. ప్రత్యక్ష యుద్ధానికి దిగకుండా, సరిహద్దు వివాదాలను రేపుతూ తమ వ్యూహాత్మక లక్ష్యాలను సాధించుకోవడమే ఈ 'గ్రే–జోన్' వ్యూహం. చైనా తన కోస్ట్ గార్డ్ నౌకలతో ఇతర దేశాల పడవలను ఢీకొట్టడం, వాటర్ కెనాన్లను ప్రయోగించడం లాంటి చర్యలతో భూభాగాలను ఆక్రమించే ప్రయత్నం చేస్తోంది. అమెరికాకు చెందిన 'ర్యాండ్ కార్పొరేషన్' థింక్–ట్యాంక్ నివేదిక ప్రకారం ఇలాంటి ప్రమాదకరమైన ఢీకొట్టే చర్యలను క్షిపణి లేదా టోర్పెడో దాడితో సమానంగా పరిగణించి స్వీయరక్షణ కోసం తగిన సమాధానం చెప్పాలని పేర్కొంది.

### చట్టాలు - ఒప్పందాల ఉల్లంఘన

సైనిక విన్యాసాలు, కదలికల సమాచారాన్ని ముందస్తుగా తెలియజేసేందుకు 1991లో కుదిరిన భారత్–పాక్ ఒప్పందంలోని ఆర్టికల్ 10ని పాకిస్థాన్ ఉల్లంఘించిందని భారత్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, 1999 నాటి చారిత్రాత్మక 'లాహోర్ డిక్లరేషన్'లో రెండు దేశాల నేవీ, వైమానిక దళాల మధ్య ప్రమాదాలు, ముప్పులను నివారించేందుకు ప్రతిపాదించిన ఒప్పందం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలులోకి రాకపోవడం గమనార్హం. అనుమానాలు, పొరపాట్ల వల్ల అణ్వాయుధాలు ఉన్న ఇరు దేశాల మధ్య ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు ఇలాంటి నియమాలు అత్యంత కీలకమని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు.?

అంశాలపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు తీసుకున్నామని బ్యాంకర్లు తెలిపారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలను, లక్ష్యాలను ఇంకా చేరుకోకపోవడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఎంఎస్ఎంఈలకు రుణాల మొత్తం గతం కన్నా ఈసారి పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదని సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### కౌలు రైతులకు రుణాలపై దృష్టి పెట్టండి

'పీఎం సూర్యఘర్‌లో దేశంలోనే ముందు స్థానంలో రాష్ట్రాన్ని నిలపాలని భావిస్తున్నాం, బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు ఇస్తేనే ఇది సాధ్యమవుతుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15 శాతం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది ప్రతికూలతలు అధిగమించేందుకు కృషి చేస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.'కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేలా బ్యాంకులు ముందుకు రావాలి. రుణాల చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు, దేశంలోనే నెంబర్–1 స్థానంలో నిలిచారు. రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు రుణాలను సమయానికే చెల్లించేస్తున్నారు. కేవలం 0.67 శాతం మంది మహిళలు మాత్రమే రుణాల చెల్లింపుల్లో వెనకబడ్డారు. వీరి నుంచి రుణాల 100 శాతం రికవరీ సాధించేందుకు వన్ టైమ్ సెటిల్మెంట్ విధానం గురించి బ్యాంకులు ఆలోచన చేయాలి. అలాగే, టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ త్వరితగతిన అమలులోకి తీసుకురావాలి, సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం. డీజీపీ సైబర్ సెక్యూరిటీ సెల్‌తో సమన్వయం జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఫ్రాడ్స్–నాన్షియల్ లిటరసీ అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. నాలా చట్టం రద్దు చేసినందున నాలా పేరుతో రుణాలు ఇవ్వకుండా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దు' అని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

### 236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యాంశాలు

'ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకింగ్‌లో రుణాల వేగం పెరిగింది. 2026 జూన్ నాటికి రూ.10.28 లక్షల కోట్లకు మొత్తం అడ్వాన్సులు చేరాయి. వ్యవసాయ రంగానికి భారీగా రుణ మద్దతు లభించింది'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'జూన్ 2026 నాటికి వ్యవసాయ రుణాలు రూ.3.98 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాది కన్నా ఎక్కువ. అటు ఎంఎస్ఎంఈలకు సంబంధించి 2026–27 ఆర్థిక సంవత్సరం జూన్ వరకు తొలి త్రైమాసికంలో 2.33 లక్షల ఎంఎస్ఎంఈలకు రూ.63,686 కోట్ల రుణాల పంపిణీ జరిగింది.

అటు పీఎం సూర్య ఘర్‌కు సెప్టెంబర్ 10 నాటికి 1,57,703 దరఖాస్తులు రాగా రూ.3,081 కోట్ల రుణాల మంజూరు చేశారు'అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. 'మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని బ్యాంకుల్లో సర్వీస్ ఛార్జీల నుంచి పూర్తి స్థాయి మినహాయింపు ఇచ్చాయి. ఎస్‌హెచ్‌జీలకు సెప్టెంబర్ 10 నాటికి మొత్తం రూ.18,621 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. పీఎం ముద్ర రుణాల్లో భారీ పురోగతి కనిపించింది. సెప్టెంబర్ 10 నాటికి 4,48,562 దరఖాస్తులకు రూ.13,757 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. మరోవైపు సమీక్షలో రాజధాని అమరావతి ఫైనాన్సియల్ హబ్‌లో పలు బ్యాంక్ కార్యాలయాల నిర్మాణాల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

మరింత వేగంగా నిర్మాణాలు పూర్తిచేయడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలి'అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అలాగే ఇకపై ఎస్ఎల్‌బీసీ సమావేశాలను, బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా ఫలితాలు విశ్లేషించిన తర్వాతే దానిపై సమీక్షించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, బ్యాంకింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు

జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు."చంద్రబాబు.. ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్

మూసా, ఈసా నదుల సంగమ స్థలమైన గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవన పనులను చేపడతామని తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీని పూర్తిగా నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

### గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం

హైదరాబాద్‌ను కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు అంగీకరించాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక సేవలు అందించడంతో పాటు పెట్టుబడులు పెట్టాలని కోరగా, అందుకు సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీలో రాబోయే డిసెంబరులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సింగపూర్ బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, సింగపూర్ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, కాన్సులేట్ జనరల్ విలియం చిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా

# ప్రభుత్వానికే అప్పగిస్తా

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తన భూములకు సంబంధించి వివరిస్తున్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసి మరీసమాధానం చెప్పారు.

### గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికి ఇచ్చేస్తా

అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు అబద్ధాలు చెప్పారు అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పుకొచ్చారు. అసలు ఈ ముఖ్యమంత్రి పైనే మాకు నమ్మకం లేదు అసెంబ్లీలో ఈరోజు సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి అని కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గుంపు మేస్త్రీ – గుంటనక్క ముమ్మాటికీ కలిసే ఉన్నారని మరోమారు స్పష్టం చేస్తున్నా అని చెప్పుకొచ్చారు. సీఎం అసెంబ్లీలో ప్రస్తావించిన గుంట నక్క, కేసీఆర్ ఫాం హౌస్‌లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలి అని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్న ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నాను అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు.

## నీ ఆస్తులు.. మా ఆస్తులపై

# సిట్టింగ్ జడ్జీతో ఎంక్వైరీకి సిద్ధం

ఇవన్నీ రేవంత్ రెడ్డి చెప్పినవేనన్నారు.కేటీఆర్ మీద నా మీద, మా నాయకుల మీద ఇన్ని ఆరోపణలు చేశావు కదా బీఆర్ఎస్ హయాంలో ధరణి విషయంలో కావొచ్చు. లేదు కాంగ్రెస్ వచ్చిన డిసెంబర్ 7 2023 నుంచి ఈ రోజు వరకు భూభారతి వరకు నీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా.? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా, నువ్వు ముందుకు రా, నీ కింద పనిచేసే అధికారులు కాదు, నీది లేదు, నాది లేదు, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దాం. బీఆర్ఎస్ హయాంలో జరిగింది కానీ ఈ మూడేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో జరిగిన అవకతవకల మీద, ధరణిలో, భూభారతిలో రేవంత్ రెడ్డి హయాంలో జరిగిన వాటి మీద మీ ఆస్తుల గురించి మా ఆస్తుల గురించి కూడా మాట్లాడుదామన్నారు. మా ఆస్తులు, రేవంత్ రెడ్డి ఆస్తులు నీ తమ్ముళ్ల ఆస్తులు ఎట్ల పెరిగినయ్, అన్నిటి మీద సిట్టింగ్ జడ్జితో మేం ఎంక్వైరీకి సిద్ధం నువ్వు రెడీనా.? అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి ఉందని గంటన్నరలో మాకు సమాచారం వచ్చింది. రేవంత్ రెడ్డి భూమి పక్కనే ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని తెలిసింది. ఫ్యూచర్ సిటీ చుట్టూ, మిగతా చోట్ల ఉన్న భూముల వివరాలు అన్నీ సేకరిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్

వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం.గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# రూ. 2000 దాటిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు

నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. దేశంలో 95 శాతం వ్యాపార లావాదేవీలు రూ.2,000 లోపే జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు గుర్తుచేశారు.యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గతంలో 'జీరో–ఎండీఆర్' ప్రోత్సాహక పథకం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేదని, కొత్త విధానంతో ఆ భారం తప్పుతుందని భావిస్తోంది.

ఉచిత చెల్లింపుల విధానం దీర్ఘకాలంలో ఏ మేరకు సమర్థవంతంగా కొనసాగుతుందనే అంశంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలోనే ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిని 'యూపీఐ పన్ను'గా అభివర్ణించిన ఆయన, అమెరికా ఒత్తిళ్లకు ప్రధాని మోదీ తలొగ్గారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఖండించింది. దేశంలో స్వయం సమృద్ధమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నామని, ఇందులో ఎటువంటి విదేశీ ఒత్తిడి లేదని స్పష్టం చేసింది.

# ఓటుకు నోటు కేసులో రేవంత్ వాదనలు పూర్తి

ఏసీబీ విచారణ జరిపే అధికారం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు.సీఎం రేవంత్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్ర వాదనలు వినిపించారు. సుమారు 2 గంటలపాటు ఆయన తన వాదనలు కొనసాగించినట్లు సమాచారం. 2015లో జరిగిన ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారానికి 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టాన్ని వర్తింపజేయడం సాధ్యం కాదని సిద్ధార్థ్ లూత్ర వాదించారు. అప్పటికి అమల్లో ఉన్న 1988 అవినీతి నిరోధక చట్టం ప్రకారం లంచం ఇవ్వడం నేరంగా పరిగణించలేదని పేర్కొన్నారు.2018 సవరణ తర్వాతే లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ స్పష్టంగా నేరాలుగా మారాయని కాబట్టి 2015లో జరిగిన ఘటనకు ఆ సవరణను వర్తింపజేయరాదని రేవంత్ రెడ్డి తరఫు లాయర్ వాదించారు. ఈ కేసు నమోదు ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు పాటించలేదని పిటిషనర్ల తరఫు లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్ఐఆర్, జనరల్ డైరీ ఎంట్రీ నమోదు చేయకుండానే ట్రాప్ నిర్వహించారని వాదించారు.అలాగే ఈ కేసులో కుట్రకు సంబంధించిన ఆధారాలు లేవని ఎమ్మెల్యే ఓటు వేయడం అధికారిక విధుల్లో భాగం కాదని పేర్కొన్నారు. అందువల్ల ఈ వ్యవహారాన్ని అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి తీసుకురావడం సరికాదని కోర్టును కోరారు. వాదనల సమయంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఓటు వేయడం చట్టబద్ధమైన హక్కు అని ఆ హక్కును ప్రభావితం చేసే ప్రయత్నం జరిగితే అవినీతి నిరోధక చట్టం వర్తించే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఓటు హక్కు, ఎమ్మెల్యేల ఓటును ప్రభావితం చేయడం, అవినీతి నిరోధక చట్టం వర్తింపు వంటి అంశాలపై విచారణలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.బుధవారం విచారణలో సీఎం రేవంత్ రెడ్డి తరఫు వాదనలు పూర్తి అయ్యాయి. తదుపరి విచారణలో బీఆర్ఎస్ తరఫు లాయర్ల వాదనలు వింటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం వాదనలు వినిపించాల్సి ఉండగా విచారణ సమయంలో ఆయన అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో తదుపరి విచారణలో బీఆర్ఎస్ తరఫు వాదనలు కొనసాగనున్నాయి. ఈ కేసుపై తదుపరి విచారణ తేదీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఖరారు చేయనుంది. కేసులో నిందితులపై నమోదైన అభియోగాలు ఏసీబీ దర్యాప్తు చెల్లుబాటు, 2018 సవరణ చట్టం వర్తింపు వంటి అంశాలపై సుప్రీంకోర్టు విచారణ కొనసాగించనుంది.

## జర్నలిస్టుల ప్రతిభకు

# రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం2025

- ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- 12 విభాగాల్లో పురస్కారాలురూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు పురస్కారాలు
- సెప్టెంబరు 28లోగా దరఖాస్తులు
- రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్

**విజయవాడ:** జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా కింది చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.డైరెక్టర్,సమాచార పౌరసంబంధాల శాఖ,2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్,విజయవాడ ? 520013.కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలుకింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించ కుండా,ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది.1. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం 2. కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు 3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డుదరఖాస్తుల ఆధారంగా కమిటీ ఎంపిక చేసే అవార్డులు.

1. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డునగదు పురస్కారం: రూ.2 లక్షలు,అర్హతలు: జర్నలిజం వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పూర్తికాలపు జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న పేరొందిన తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో లేదా రాష్ట్రం వెలుపల పనిచేస్తున్న జర్నలిస్టులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.2. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు గ్రామీణ జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు జర్నలిస్టులకు ప్రముఖ పాత్రికేయుల పేర్లతో మూడు అవార్డులు అందజేస్తారు.ఖాసా సుబ్బారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డుముట్నూరి కృష్ణారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు,మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డుఒక్కో అవార్డు నగదు పురస్కారం: రూ.1 లక్ష

# కొడుకు ఇంటిముందు తల్లిదండ్రుల ధర్నా

**హైదరాబాద్** కన్న కొడుకు గెంటివేశాడని ఇంటిముందు తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. మియాపూర్ ఆల్విన్ కాలనీలో ఇంటిముందు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. కొడుకు కోడలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ.. ఇంటి నుంచి బయటకు గెంటేసి ఇల్లు అమ్మకానికి పెడుతున్నారని ఫ్లెక్సీతో ధర్నా చేసారు.

# ఎస్సై వేధిస్తున్నాడని కుటుంబం ఆందోళన

**మహబూబ్ నగర్** ఎస్సై వేధిస్తున్నాడని పోలీస్టేషన్ ఎదుట పురుగుల మందు డబ్బాతో కుటుంబం ఆందోళనకు దిగింది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఎస్సై రవికుమార్ నుండి ప్రాణహాని ఉందని పోలీస్టేషన్ ఎదుట కుటుంబం మొత్తం పురుగుల మందు డబ్బాతో బైఠాయించారు. ఇంటి దారి, భూవివాదంలో కేసుకు సంబంధించిన ఆధారాలు పరిశీలించకుండానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితుల ఆరోపణ. ఎస్సై బి. రవికుమార్ తమను అసభ్య పదజాలంతో దూషించారని బాధితుల ఆవేదన. పోలీస్టేషన్కు పిలిపించి తీవ్రంగా వేధిస్తున్నారని, దంతాలపల్లి మండలం తూర్పు తండా గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు గూగులోత్ రూప్సింగ్ల అయన కుటుంబ సభ్యులు ఆవేదన. తమకు ప్రాణహాని ఉందని రూప్సింగ్ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసారు. ఎస్సైపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

# హద్దులు మారి.. డివిజన్లు పెరిగి

## - ఆరు ప్రాంతాల్లో పునర్విభజనకు ఆమోదముద్ర

**అనంతపురం** నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు పురపాలికల్లో డివిజన్ల పెంపునకు ఆమోదముద్ర పడింది. తద్వారా గత రెండు నెలలుగా ఊరిస్తూ వచ్చిన ఈ ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది.అడ్డంకులు తొలగడంతో..2011 జనాభా లెక్కల ప్రకారం వార్డులను పునర్విభజన చేస్తూ గతంలోనే ప్రకటన ఇవ్వగా, దానిపై వైకాపా నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం దాన్ని కొట్టివేయడంతో తిరిగి డివిజన్ల పునర్విభజన చేపట్టి అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. వాటిని పరిశీలించిన అనంతరం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.కేసులు లేని వాటిలో పలు ప్రక్రియలు పూర్తి కాగా, కోర్టు కేసులు ఉన్న చోట్ల కొంత జాప్యం జరిగింది. ఇప్పుడు అడ్డంకులన్నీ తొలగిపోవడంతో అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా పురపాలక పరిపాలన శాఖ కసరత్తు చేపట్టింది.

కోర్టు కేసులు తొలగిపోవడంతో అనంతపురం నగరం, తాడిపత్రి, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి పురపాలికల్లో పెరిగిన వార్డులకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలు ప్రచురించాల్సి ఉంది. కోర్టు కేసులు లేని హిందూపురం, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, పెనుకొండ, మడకశిరలో డివిజన్ల పునర్విభజనతో పాటు ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను సైతం ఇప్పటికే ప్రకటించారు. వార్డుల పునర్విభజన చేయక ముందు ఉమ్మడి జిల్లాలోని 12 పురపాలికల్లో మొత్తం 378 వార్డులు ఉండగా, ప్రస్తుతం అవి 480కి చేరాయి. మొత్తంగా 102 వార్డులు పెరిగాయి.

# వివేకా హత్య కేసు

## - నిందితుల డిశ్చార్జ్ పిటిషన్ల కొట్టివేత

**హైదరాబాద్ :** మాజీ మంత్రి 'వివేకానందరెడ్డి హత్య కేసు' నిందితులకు సీబీఐ కోర్టులో చుక్కెదురయింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు నాంపల్లిలోని సీబీఐ కోర్టు తిరుస్కరించింది. ఏ1 గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్రెడ్డి, ఏ6 ఉదయ్ డిశ్చార్జ్ పిటిషన్లు సీబీఐ కోర్టు తిరుస్కరించింది. పిటిషన్లకు విచారణ అర్హత లేదని నాంపల్లి సీబీఐ కోర్టు వ్యాఖ్యానించింది.

# సుగంధ మాలల మధ్య స్నపన తిరుమంజనం

**- ఏలకులు, వట్టివేరు, ఎండు ద్రాక్ష.. బాదం**

**- పిస్తా మాలలతో శ్రీవారి ఉత్సవమూర్తులకు అలంకారం**



**తిరుమల(ప్రశ్న న్యూస్)**ఏలకులు, వట్టివేరు, ఎండు ద్రాక్ష, బాదం--పిస్తా తదితర సుగంధ ద్రవ్యాలతో రూపొందించిన విశేష మాలల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి స్నపన తిరుమంజనం బుధవారం తిరుమలలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది.శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు అర్చకస్వాములు వేద మంత్రోచ్చారణల నడుమ వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు.

## పంచామృతాలతో అభిషేకం

స్వామి, అమ్మవార్లకు పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, తేనె, పసుపు, గంధంతో విశేష అభిషేకం చేశారు. శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీటీడీ వేద పారాయణదారులు ఉపనిషత్ మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం తదితర పంచసూక్తాలను భక్తిభావంతో పారాయణం చేశారు. అభిషేకానంతరం తిరుమల పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్లు వివిధ దివ్య పాశురాలను పఠించారు.

## పరిమళాల మాలలతో ప్రత్యేక అలంకారం

స్నపన తిరుమంజనం అనంతరం ఏలకులు, వట్టివేరు, ఎండు ద్రాక్ష, నీలిరంగు పవిత్ర మాలలు, బాదం--పిస్తా మాలలు, పసుపు కొమ్ముల మాలలు, నందివర్ధనం--తామర మాలలు, రోజ్ పెటల్స్‌తో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.సుగంధ ద్రవ్యాల పరిమళాలు, వేదఘోషలు, భక్తుల ఆధ్యాత్మిక భావనలతో రంగనాయకుల మండపం భక్తి శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యురాలు శ్రీమతి సుచిత్ర ఎల్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్జెండర్ల' ఆధిపత్య పోరులో యువకుడి హత్య

**అనంతపురం** ఫ్లెక్సీ ఓపెనింగ్కు ట్రాన్స్జెండర్ చిత్రాలను ఆహ్వానించడంతో వివాదం.. ఆధిపత్య పోరుగా మారింది. వీరేష్ ఇంటిపై ఒక్కసారిగా 25 మంది దాడి చేసారు. .అన్నపై దాడి జరుగుతోందని బయటకు వచ్చిన చరణ్పై దాడిచేసి అక్కడికక్కడే కత్తులు, రాళ్లతో దారుణంగా హత్యచేసారు. వీరేష్కు మరియు వికాస్ అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బళ్లారికి తరలించారు. హత్యకు పాల్పడిన వారి కోసం నాలుగు పోలీసు బృందాల గాలింపు చేస్తున్నారు. అసలు ఫ్లెక్సీ ఓపెనింగ్ వివాదం ఇంత దారుణానికి ఎలా దారితీసింది?! పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కోటపెల్లి** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల పట్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని భారత రాష్ట్ర సమితి (ఃఖీూ) పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.గత కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన మెటీరియల్ బిల్లులు, గుడ్ల బిల్లులు మరియు వంట కార్మికులకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాలు విడుదల చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. పసిపిల్లలు ఆకలితో అలమటించకూడదన్న మానవతా దృక్పథంతో కార్మికులు బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ వండిపెడుతున్నారు .నిత్యావసర సరుకులు, నూనె, కూరగాయలు, గ్యాస్ సిలిండర్ల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, బిల్లులు ఇవ్వకుండా వారిని అప్పులపాలు చేయడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఃఖీూ పార్టీ ప్రశ్నిస్తోంది.ఃఖీూ పార్టీ ప్రధాన డిమాండ్లు:పెండింగ్ బిల్లుల విడుదల: కోటపెల్లి మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను వెంటనే వడ్డీతో సహా విడుదల చేయాలి.బకాయి వేతనాలు: వంట కార్మికులకు రావాల్సిన నెలల తరబడి గౌరవ వేతనాల బకాయిలను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలి.గ్రీన్ ఛానెల్ అమలు: ప్రతి నెలా 5వ తేదీ లోపు బిల్లులు, వేతనాలు నేరుగా అందేలా 'గ్రీన్ ఛానెల్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి.వంట ఖర్చుల పెంపు: ప్రస్తుత ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులను పెంచాలి.

## నివాసం పేరుతో ఒప్పందాలు..

# ఆపై వాణిజ్య కార్యకలాపాలా?

**- ఆశ్రయ్ మెడోస్‌లో నిబంధనల ఉల్లంఘనలపై వాసుల ఫిర్యాదు..**

**- ప్రశ్నిస్తే బెదిరింపుల ఆరోపణలు**

నిర్మాణ సమయంలో నివాస భవనాలుగా పేర్కొని ఒప్పందాలు చేసుకుని, నిర్మాణం పూర్తయిన తర్వాత అదే భవనాలను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని అమీర్‌పేట్ ధర్మకరం రోడ్డులోని ఆశ్రయ్ మెడోస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. అపార్ట్‌మెంట్ పరిధిలో జరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలపై ప్రశ్నిస్తున్న నివాసితులను కొందరు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది.ఆశ్రయ్ మెడోస్ నిర్మాణ సమయంలో భవనాలను పూర్తిగా నివాస అవసరాలకే వినియోగిస్తామని సంబంధిత వ్యక్తులు ఎంవోయూ ద్వారా హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆ హామీ ఆధారంగానే పలువురు కుటుంబాలు అక్కడ నివాసాలు కొనుగోలు చేసి ఉంటున్నాయని పేర్కొన్నారు. అయితే నిర్మాణం పూర్తయిన అనంతరం కొన్ని భవనాల్లో నివాస అవసరాలకు భిన్నంగా వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోకి వాణిజ్య కార్యకలాపాల కోసం బయట వ్యక్తుల రాకపోకలు పెరగడంతో అక్కడ నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాసులు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు నివసించే ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగడం వల్ల భద్రతాపరమైన ఆందోళనలు ఏర్పడుతున్నాయని చెప్పారు.వాణిజ్య భవనాలకు వచ్చే సంబంధిత వ్యక్తులు తమపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు వాపోయారు. నివాసితుల భద్రత, ప్రశాంతతకు భంగం కలిగించే పరిస్థితులు ఏర్పడుతున్నప్పటికీ సంబంధిత సమస్యపై తగిన చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్న భవనాలకు సంబంధిత అనుమతులు ఉన్నాయా? నిర్మాణ అనుమతులు ఏ ప్రయోజనం కోసం మంజూరయ్యాయి అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని అసోసియేషన్ కోరింది. నిర్మాణ అనుమతులు, భవనాల వినియోగానికి సంబంధించిన పత్రాలు, ఎంవోయూలు, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది.నివాస అవసరాల కోసం అనుమతులు పొందిన భవనాలను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అదే సమయంలో వాణిజ్య కార్యకలాపాల పేరుతో నివాసితులను బెదిరిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపైనా అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా, భవనాల వినియోగం అనుమతులకు అనుగుణంగా ఉండేలా సంబంధిత శాఖలు పర్యవేక్షించాలని వాసులు కోరుతున్నారు. సమస్యను కేవలం అపార్ట్‌మెంట్ అంతర్గత వివాదంగా కాకుండా భవన వినియోగ నిబంధనలు, నివాసితుల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించి తక్షణమే విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ ఫిర్యాదుపై అధికారులు స్పందించి వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

# హంస వాహనంపై శ్రీవారికి నృత్య నీరాజనం

**- ఎనిమిది రాష్ట్రాల నుంచి 19 కళాబృందాలు..**

**- 504 మంది కళాకారుల ప్రదర్శనలు వేషధారణలో వైవిధ్యం..**

**- నృత్యాల్లో సంప్రదాయ పరిమళం**

**- జానపద కళలతో తిరుమాడ వీధుల్లో వెల్లివిరిసిన భారతీయ సంస్కృతి**









**తిరుమల(ప్రశ్న న్యూస్)** ఒకవైపు హంస వాహనంపై సరస్వతి అలంకారంలో కొలువైన శ్రీవారు... మరోవైపు దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన కళాకారుల నృత్య విన్యాసాలు... మంగళవాయిద్యాల మోత... వేదఘోషలు... గోవింద నామస్మరణ... సంప్రదాయ వేషధారణలో కళాకారుల సందడి... వెరసి తిరుమాడ వీధులు ఓ మహా సాంస్కృతిక వేదికను తలపించాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం రాత్రి జరిగిన హంస వాహనసేవ భక్తి, కళ, సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచింది.హంస వాహనంపై సరస్వతి అమ్మవారి అలంకారంలో వీణను ధరించిన శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. స్వామివారి వాహనానికి ముందు సాగిన కళాకారుల బృందాలు ఒక్కో ప్రాంతం సంస్కృతికి అద్దం పట్టేలా నృత్యాలు, జానపద కళారూపాలు ప్రదర్శించాయి.ఎనిమిది రాష్ట్రాలు.. 19 కళాబృందాలుఈ ఏడాది హంస వాహనసేవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 19 కళాబృందాల నుంచి 504 మంది కళాకారులు పాల్గొన్నారు. తమ తమ ప్రాంతాల ప్రత్యేకతను ప్రతిబింబించే నృత్యాలు, వాయిద్యాలు, జానపద ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు.వేదిక ఒక్కటే అయినా.. కళారూపాలు మాత్రం అనేకం. అడుగుల్లో ప్రాంతీయ ప్రత్యేకత, సంగీతంలో స్థానిక మాధుర్యం, వేషధారణలో తరతరాల సంప్రదాయం కనిపించింది. కళాకారులు ధరించిన రంగురంగుల వస్త్రాలు, తలపాగాలు, ఆభరణాలు, ముఖ ముసుగులు తిరుమాడ వీధులకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.దేశంలోని భిన్న ప్రాంతాల్లో పుట్టి పెరిగిన కళారూపాలు శ్రీవారి సన్నిధిలో ఒకే చోట కలవడంతో భక్తులకు భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది.

## తరాలు చెప్పుకునే సాంస్కృతిక జ్ఞాపకం


హంస వాహనసేవ ముగిసిన తరువాత కూడా తిరుమాడ వీధుల్లో మార్మోగిన సంగీతం, కనిపించిన రంగురంగుల వేషధారణలు, కళ్లముందు కదిలిన నృత్య విన్యాసాలు భక్తుల మనసుల్లో నిలిచిపోయాయి.దేశం నలుమూలల నుంచి వచ్చిన 504 మంది కళాకారులు తమ కళల ద్వారా ఒకే సందేశాన్ని చాటారు---ప్రాంతాలు వేరు కావచ్చు.. భాషలు వేరు కావచ్చు.. వేషధారణలు వేరు కావచ్చు.. కానీ కళ మనుషులను ఒక్కటిగా కలుపుతుంది.శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో హంస వాహనసేవ సందర్భంగా ఆవిష్కృతమైన ఈ కళా సంగమం తిరుమల చరిత్రలో మరో అందమైన సాంస్కృతిక అధ్యాయంగా నిలిచింది. భక్తి, కళ, సంప్రదాయం, భారతీయ సంస్కృతి ఒకే చోట కలిసిన ఆ రాత్రి.. తిరుమాడ వీధులు ఓ మహా సాంస్కృతిక వేదికగా మారాయి.

# పల్లెకు పట్టం.. అభివృద్ధికి బాట

**- రెండేళ్లలో గ్రామీణాంధ్ర రూపురేఖల్లో మార్పు- 9,600 కి.మీ. సీసీ రోడ్లు.. మరో 10 వేల కి.మీ. బీటీ రోడ్లు**

**- గిరిజన గూడేలకు 2,310 కి.మీ. 'అడవితల్లి బాట' - 1.15 లక్షల పంట కుంటలు.. 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు**

**- 38 వేల మినీ గోకులాలు.. 15 వేల నీటి తొట్టెలు - పల్లెపండుగ--3.0కు సిద్ధమవుతున్న ప్రభుత్వం**





**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు వర్షాకాలంలో బురదమయమయ్యే గ్రామీణ రహదారులు.. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులు.. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రహదారి కష్టాలు.. మారుమూల గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు.. సాగునీటి కోసం ఎదురుచూసే రైతులు.. పశువులకు నీడ, నీటి కోసం ఇబ్బందులు.. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాల్లో చిరకాలంగా ఉన్న సమస్యలు. ఇప్పుడు వాటిలో కొన్నింటికి పరిష్కార మార్గం చూపుతూ గ్రామీణ మౌలిక వసతులపై ప్రభుత్వం భారీగా దృష్టి సారించింది.ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గ్రామసభల్లో ప్రజలు గుర్తించిన



అవసరాలను పనులుగా మార్చి 'పల్లెపండుగ', 'పల్లెపండుగ--2.0' కార్యక్రమాల ద్వారా అమలు చేసినట్లు తెలిపింది. రహదారుల నుంచి సాగునీటి వసతులు, పాడి రైతు సదుపాయాల నుంచి పారిశుధ్యం వరకు పలు రంగాల్లో పనులు చేపట్టినట్లు పేర్కొంది.

## 13,326 పంచాయతీల్లో గ్రామసభలు

గ్రామాభివృద్ధికి తొలి అడుగు గ్రామసభ నుంచే పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను గుర్తించినట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రామసభల్లో వచ్చిన తీర్మానాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసి వాటిని పల్లెపండుగ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టినట్లు పేర్కొంది.దీంతో గ్రామాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రెయినేజీలు, నీటి సంరక్షణ, పశుసంవర్ధక వసతులు తదితర పనులకు ప్రాధాన్యం లభించినట్లు తెలిపింది.

## సీసీ రోడ్లతో అంతర్గత అనుసంధానం

పల్లెపండుగ రెండు దశల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 9,600 కి.మీ. సీసీ రోడ్లు నిర్మించినట్లు ప్రభుత్వం పేర్కొంది. గ్రామాల్లోని అంతర్గత రహదారుల పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ల మధ్య రాకపోకలకు ఇవి ఉపయోగపడుతున్నట్లు తెలిపింది.

అదే సమయంలో గ్రామాలు--గ్రామాలు, గ్రామాలు--మండల కేంద్రాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు 10 వేల కి.మీ. మేర బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన చోట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపింది.

## బడి.. ఆసుపత్రి.. మార్కెట్‌కు దారి

గ్రామీణ రహదారి అనేది కేవలం రాకపోకల సౌకర్యం మాత్రమే కాదని, విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెటింగ్‌తో ముడిపడి ఉందని ప్రభుత్వం పేర్కొంది. అందుకే విద్యార్థులు పాఠశాలలకు, గ్రామీణ ప్రజలు ఆరోగ్య కేంద్రాలకు, రైతులు మార్కెట్లకు సులభంగా చేరుకునేలా రహదారి పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపింది.



అదేవిధంగా ప్రసిద్ధ ఆలయ క్షేత్రాలకు వచ్చే భక్తులకు రాకపోకలు మెరుగుపడేలా పలు రహదారి పనులు చేపట్టినట్లు వెల్లడించింది. రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం, శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గంతో పాటు అంతర్వేది, కోటప్పకొండ, ఐ.ఎస్. జగన్నాథపురం తదితర క్షేత్రాలకు రహదారి సదుపాయాలను మెరుగుపరిచినట్లు తెలిపింది.పల్లెపండుగ రెండు దశల్లో 100కుపైగా క్షేత్రాల్లో రూ.120 కోట్ల వ్యయంతో 205 కి.మీ. రహదారుల నిర్మాణం చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

## వినతికి స్పందన.. రహదారి మంజూరు

ప్రజల నుంచి వచ్చిన వినతులపై వేగంగా స్పందించిన




సందర్భాలు కూడా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. ఉదయగిరి నియోజకవర్గం గజ్జలవారిపల్లి విద్యార్థులు పాఠశాలకు వెళ్లే రహదారి సరిగా లేదని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయడంతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది.

అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ టి.సి. దీపిక తన గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని కోరిన సందర్భంలోనూ రహదారి మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. అల్లూరి జిల్లా లబ్బర్తి పంచాయతీకి చెందిన లాకే బాబురావు తన గ్రామానికి రహదారి కావాలని కోరగా వెంటనే మంజూరు చేసినట్లు పేర్కొంది.

## గిరిజన గూడేలకు 'అడవితల్లి బాట'

మారుమూల గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా డోలీ మోతల నుంచి గిరిజన గ్రామాలను విముక్తం చేయాలన్న లక్ష్యంతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించింది.రెండు దశల్లో రూ.2,078 కోట్లతో 2,310 కి.మీ. మేర రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొంది. ఇందులో వెయ్యి కి.మీ.కుపైగా రహదారుల నిర్మాణం పూర్తయినట్లు తెలిపింది.కొండలు, అడవులు, వాగులు, కఠినమైన భౌగోళిక పరిస్థితుల మధ్య ఉన్న గిరిజన గ్రామాలకు రహదారి కల్పించడం సవాలుతో కూడుకున్నదైనా పనులు కొనసాగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ప్రధానమంత్రి జన్‌మన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇతర కేంద్ర పథకాల నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపింది.

## రైతు పొలానికి నీటి భరోసా

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడంతో పాటు రైతులకు సాగునీటి వెసులుబాటు కల్పించేందుకు పంట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 1.15 లక్షల పంట కుంటలు నిర్మించినట్లు పేర్కొంది.రాయలసీమలో ఈ కార్యక్రమం తర్వాత సుమారు 50 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది. పంట కుంటలతో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతోపాటు భూగర్భ జలాల లభ్యత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

## 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు

రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అందించేందుకు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేసినట్లు పేర్కొంది.వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆదాయ అవకాశాలను పెంచేలా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించింది.

## పాడి రైతుకు మినీ గోకులం

పశుపోషకులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 38 వేలకుపైగా మినీ గోకులాలు నిర్మించినట్లు ప్రభుత్వం తెలిపింది. పశువులకు ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు 15 వేల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టినట్లు తెలిపింది. పాడి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక మౌలిక వసతులను విస్తరిస్తున్నట్లు పేర్కొంది.

## డ్రెయినేజీకి కొత్త రూపం

గ్రామీణ పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు డ్రెయినేజీ వ్యవస్థపైనా దృష్టి పెట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. దోమలు, దుర్వాసన సమస్యలను తగ్గించేందుకు 54 కి.మీ. మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించినట్లు పేర్కొంది.ఇంకుడు గుంతలు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు తదితర కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

## ఇక 'పల్లెపండుగ--3.0'

రెండు దశల్లో చేపట్టిన పనుల ఆధారంగా తదుపరి దశలో మరింత విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు 'పల్లెపండుగ--3.0'కు ప్రభుత్వం రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది.వీబీ--జీ రామ్‌జీ, సాస్కీ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.రోడ్డు నుంచి రైతు పొలం వరకు.. గిరిజన గూడెం నుంచి పాడి రైతు పాక వరకు.. పారిశుధ్యం నుంచి నీటి సంరక్షణ వరకు గ్రామీణ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలపై పనులు చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. పల్లెపండుగ--3.0లో ఈ కార్యక్రమాలకు మరింత విస్తృత రూపం ఇవ్వాలన్నది లక్ష్యంగా పేర్కొంటోంది.

## చిన్నశేష వాహనసేవలో కళా వైభవం



తిరుమల(ప్రశ్న న్యూస్)శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం నిర్వహించిన చిన్నశేష వాహనసేవలో దేశంలోని వివిధ రాష్ట్రాల కళారూపాలు భక్తులను అలరించాయి. తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 20 కళాబృందాల నుంచి 539 మంది కళాకారులు పాల్గొని తమ సంప్రదాయ కళా ప్రదర్శనలతో తిరుమాడ వీధుల్లో కళా వైభవాన్ని ఆవిష్కరించారు.శ్రీ మలయప్పస్వామివారు చిన్నశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వాహనసేవకు ముందు వివిధ ప్రాంతాల కళాకారులు సంగీతం, నృత్యం, జానపద కళల సమ్మేళనంతో ప్రదర్శనలు ఇచ్చారు.

### తొమ్మిది రాష్ట్రాల కళాకారులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన కళాబృందాలు పాల్గొన్నాయి. శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల కళాకారులు భరతనాట్యం, ఒడిశీ, గరగాటం తదితర కళారూపాలను ప్రదర్శించారు.ఆంధ్రప్రదేశ్ బృందాలు ఎదుకుల వైభవం, కోలాటం ప్రదర్శించగా.. పుదుచ్చేరి కళాకారులు ఒయ్యిల్లాట్టంతో ఆకట్టుకున్నారు. వారణాసి కళాకారుల శ్రీమద్రామాయణం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహారాష్ట్ర కళాకారుల దగర్ గాజా, డ్రీమ్స్, అస్సాం కళాకారుల బోర్థాల్, పశ్చిమబెంగాల్ బృందాల ఒడిశీ నృత్యాలు భక్తులను అలరించాయి.

### భిన్నత్వంలో ఏకత్వం

బిహు, మంజునాథ చరితం, కాళింగ నర్తన, కోలాటం, తమిళ జానపద కళలతో పాటు పలు సంప్రదాయ కళారూపాలను కళాకారులు ప్రదర్శించారు. సంప్రదాయ వస్త్రధారణ, మధురమైన సంగీతం, నృత్య విన్యాసాలతో తిరుమాడ వీధులు కళా శోభను సంతరించుకున్నాయి.శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పాయి. దేశంలోని వివిధ ప్రాంతాల కళా సంప్రదాయాలు శ్రీవారి సన్నిధిలో ఒకే వేదికపై కొలువుదీరడంతో భక్తి, సంగీతం, నృత్యం, జానపద కళల సమ్మేళనం కనువిందు చేసింది.

## చిన్నకేశవ దేవాలయ భూములపై చర్యలు తీసుకోవాలి




ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) బొప్పాపూర్ గ్రామంలో చెన్నకేశవ దేవాలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వీటి పైన చర్యలు తీసుకొని, దేవాలయ భూములు కాపాడాలని కరీంనగర్ లోని సహాయ కమిషనర్ కు చిన్నకేశవ ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే 1100 ల సంవత్సరాల క్రితం బొప్పాపూర్ గ్రామంలో చిన్నకేశవ ఆలయం ఏర్పడిందని అప్పట్లో ఆలయ పూజారులకు ఎలాంటి ఆదాయం లేకపోవడంతో పూజారులకు మరియు గుడి అభివృద్ధి కొరకు కొన్ని ఎకరాలు కేటాయించడం జరిగిందని, అట్టి భూమిని కొంతమంది తప్పుడు దృవపత్రాలతో పట్టా చేసుకొని సాగు చేస్తున్నారని ప్రస్తుతం ఆలయ కమిటీ సభ్యులు ఈ యొక్క గుడిని వారి సొంత మరియు దాతల సహకారంతో అభివృద్ధి చేశామని కానీ ఆలయానికి ఆదాయం లేనందున చిన్నకేశవ దేవాలయానికి సంబంధించిన భూములు రికవరీ చేసి కబ్జాదారుల పైన కఠినమైన చర్యలు తీసుకొని ఆలయ అభివృద్ధికి సహకరించాలని సహాయ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు, సహాయ కమిషనర్ గారు సానుకూలంగా స్పందించి అట్టి భూములపై వెంటనే చర్య తీసుకొని దేవాలయ భూములు కాపాడుతామని భరోసానిచ్చారు.

## ముదిరాజ్ ఆత్మ గౌరవ సింహగర్జన
## కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) మూడు సంవత్సరాలు గడుస్తున్న ముదిరాజులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ముదిరాజులను బీసీ డి నుండి ఏ లోకి మార్చాలని ప్రభుత్వాన్ని ముదిరాజులు డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా ముదిరాజులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ నెల 28వ తేదీన సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ లో చేపట్టే ముదిరాజ్ ఆత్మ గౌరవ సింహగర్జన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అనంతరం పోలీసులను కలిసి ముదిరాజ్ ఆత్మగౌరవ సింహ గర్జన కార్యక్రమానికి అనుమతుల కోసం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, కోడి అంతయ్య పర్ష హనుమండ్లు,వంకాయల కార్తీక్, ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, పర్షరాములు, రాయిని ప్రతాప్, పసుల తిరుపతి, కొనరావుపేట సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలకు విద్యుత్ జోరు

- 32 ఈవీ బస్సులు - భక్తుల సేవకు కొత్త ఊపు
- రిలయన్స్ 25, భారత్ బయోటెక్ 7, ఛార్జింగ్ స్టేషన్లలు
- బస్సులోనే నారాయణగిరి నుంచి మ్యూజియం వరకు సీఎం చంద్రబాబు



**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమల ఘాట్ రోడ్లపై విద్యుత్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. భక్తుల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. నారాయణగిరి సర్కిల్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం వీటిని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఓ ఈవీ బస్సులో నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు ప్రయాణించారు.

### 25 బస్సులు రిలయన్స్ నుంచి

భక్తుల సేవ కోసం రిలయన్స్ ఫౌండేషన్ 25 ఈవీ బస్సులను టీటీడీకి అందించింది. ఈ ఏడాది జూన్‌లో తిరుమల సందర్శన సందర్భంగా రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ మేరకు ప్రకటించారు. ఆ ప్రకటనకు అనుగుణంగా బస్సులను అందించారు.

### మరో 7 భారత్ బయోటెక్ నుంచి

భారత్ బయోటెక్ సంస్థ ఏడు ఎలక్ట్రిక్ బస్సులను అందించింది. దీంతో మొత్తం 32 బస్సులు భక్తుల రవాణాకు సిద్ధమయ్యాయి. బస్సులతో పాటు ఛార్జింగ్ స్టేషన్లను కూడా టీటీడీకి అందించారు.

### ఈవీలో సీఎం ప్రయాణం

బస్సులను ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు ఓ ఈవీ



బస్సులో ప్రయాణించారు. ఆయన వెంట మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రిలయన్స్ ఈవీ న్యూమొబిలిటీ సీఈఓ నితిన్ సేథ్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, టీటీడీ ఈవో రవిచంద్ర తదితరులు ఉన్నారు. నారాయణగిరి సర్కిల్ నుంచి మ్యూజియం వరకు బస్సు ప్రయాణించారు.

### హరిత రవాణాకు ప్రాధాన్యం

తిరుమలలో భక్తుల రవాణా వ్యవస్థలో ఈవీ బస్సుల సంఖ్య పెరగడంతో విద్యుత్ ఆధారిత రవాణాకు మరింత ప్రాధాన్యం లభించనుంది. ఛార్జింగ్ మౌలిక వసతులను సైతం ఏర్పాటు చేయడంతో బస్సుల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

# ఆధ్యాత్మికతకు ప్రపంచ నమూనా తిరుమల

- భక్తుల అనుభూతి పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఎస్వీ మ్యూజియం ఆధునికరణ
- 32 ఈవీ బస్సులు ప్రారంభం..
- భక్తులకు రూ.2 లక్షల బీమా



**తిరుమల(ప్రశ్న న్యూస్)** తిరుమలను పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల అనుభూతిని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో ప్రస్తుతం 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దాన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంను ప్రారంభించారు. రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.

### త్రీడీలో తిరుమల అనుభూతి

పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా వీక్షించే అవకాశం కల్పించారు. ఆరు డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు.

### రూ.104 కోట్లతో ఎస్వీ మ్యూజియం

గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునఃప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి



చేసింది.శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను సీఎం తిలకించారు. స్వామివారి సేవ, కీర్తనలకు గతంలో వినియోగించిన సంగీత వాయిద్యాలను కూడా పరిశీలించారు.

### భక్తుల రాకపోకలకు 32 ఈవీ బస్సులు

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మొబిలిటీ సీఈవో నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులతో కలిసి నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు సీఎం ఈవీ బస్సులో ప్రయాణించారు.

### భక్తులకు రూ.2 లక్షల బీమా

తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని చంద్రబాబు తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా బీమా సదుపాయం ఉంటుందని వివరించారు.

### 5 వేల ఆలయాల నిర్మాణం

రాష్ట్రంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.టీటీడీ కార్యకలాపాలను ఆరు అంశాల్లో పునర్వ్యవస్థీకరించనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# భక్తుల సేవే శ్రీవారి సేవ

- బ్రహ్మోత్సవ భక్తులతో మర్యాదగా మెలగాలి
- శ్రీవారి సేవకుల సంఖ్య రెట్టింపునకు చర్యలు: బీఆర్ నాయుడు



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు గౌరవం, మర్యాద, ఆప్యాయతతో సేవలందించాలని టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు శ్రీవారి సేవకులకు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించడంలో సేవకుల పాత్ర కీలకమని తెలిపారు.తిరుమల ఆస్థాన మండపంలో బుధవారం వివిధ రాష్ట్రాల నుంచి బ్రహ్మోత్సవ సేవలకు వచ్చిన శ్రీవారి సేవకులతో చైర్మన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి ఆయన సేవకులతో మాట్లాడారు.

### సేవకుల సంఖ్య రెట్టింపు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత బలోపేతం చేస్తామని బీఆర్ నాయుడు తెలిపారు. సేవకుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో సేవకులు అంకితభావంతో పనిచేయాలని కోరారు.

### 5 వేల ఆలయాలకు మూలస్తంభాలుగా..

టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ 5 వేల ఆలయాల నిర్మాణానికి సంకల్పించామని తెలిపారు. ఈ ఆలయాలకు శ్రీవారి సేవకులు మూలస్తంభాలుగా నిలవాలని కోరారు. నియోజకవర్గం నుంచి జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయి వరకు ప్రణాళికాబద్ధంగా హిందూ ధర్మ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

### శిక్షణతో మరింత పటిష్ఠంగా

అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోని ధార్మిక వ్యవస్థల్లో ఇంత పెద్ద సంఖ్యలో సేవకుల భాగస్వామ్యం అరుదన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం టీటీడీ ప్రధాన సిద్ధాంతమని తెలిపారు. సేవకులకు శిక్షణ అందించి శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు.

### క్రమశిక్షణతో విధులు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సేవకులు క్రమశిక్షణ, సమన్వయం, అంకితభావంతో విధులు నిర్వహించాలని అధికారులు సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందిస్తూ బ్రహ్మోత్సవాల విజయవంత నిర్వహణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేయడంలో సేవకులు కీలకంగా వ్యవహరించాలని కోరారు.కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, శ్రీవారి సేవ ఇన్‌చార్జ్, టీటీడీ సీపీఆర్వో డాక్టర్ టి.రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల చరిత్రకు సాంకేతిక రూపం

- శ్రీవారి మహత్యం..
- రాజుల కానుకలు..
- ఏడు కొండల విశిష్టత
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- ఏఐ, త్రీడీ, పానోరమిక్ స్క్రీన్‌లతో భక్తులకు సరికొత్త అనుభూతి



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి వైభవం.. తిరుమల క్షేత్ర చరిత్ర.. రాజుల కానుకలు.. భక్తుల సంగీత సేవ.. ఏడు కొండల భౌగోళిక విశిష్టత.. అన్నింటినీ ఒకే వేదికపై ఆవిష్కరించేలా ఎస్వీ మ్యూజియం కొత్త రూపు సంతరించుకుంది. ఆధునిక సాంకేతికతను జోడించి రూ.104 కోట్లతో ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవోలతో కలిసి మ్యూజియంలోని ప్రత్యేక ప్రదర్శనలను పరిశీలించారు.

### చరిత్ర కళ్లముందు..

శ్రీవారి మహత్యం, తిరుమల క్షేత్ర విశిష్టతలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా మ్యూజియంలో వివిధ అంశాలను ప్రదర్శనకు ఉంచారు. తిరుమలతో ముడిపడిన చారిత్రక ఘట్టాలు, ఆధ్యాత్మిక విశేషాలు, ఆలయ సంప్రదాయాలను ఆధునిక ప్రదర్శన విధానాలతో పరిచయం చేస్తున్నారు.

### రాజుల కానుకలకు ప్రతిరూపాలు

శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు, ఇతర సందర్భాల్లో శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. శ్రీవారికి ధరింపజేసే వివిధ కిరీటాలు, ఆభరణాలను త్రీడీ మోడళ్లుగా రూపొందించి ప్రదర్శిస్తున్నారు. దీంతో గత కాలపు రాజభక్తి, శ్రీవారి ఆభరణాల వైభవాన్ని భక్తులు సమీపంగా తెలుసుకునే అవకాశం కల్పించారు.

### ఏఐతో శ్రీవారి పరిణయం

మ్యూజియంలోని పానోరమిక్ స్క్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏఐ సాంకేతికతతో రూపొందించిన వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ప్రదర్శిస్తున్నారు. చరిత్ర, పురాణం, ఆధ్యాత్మికతను సాంకేతికతతో మేళవించి భక్తులకు కొత్త అనుభూతిని అందించేలా ఏర్పాట్లు చేశారు.

### ఏడు కొండల త్రీడీ రూపం

తిరుమలలోని ఆలయాలు, శిల్పాలు, ప్రకృతి, కొండల భౌగోళిక ప్రత్యేకతలను తెలిపే ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. భక్తులకు తిరుమల క్షేత్ర నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు ఏడు కొండల త్రీడీ మోడల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

### ఆధ్యాత్మిక బాట పట్టిన రాజుల ఆయుధాలు

తిరుమలకు వచ్చి ఆయుధాలను త్యజించి ఆధ్యాత్మికతను అనుసరించిన వివిధ రాజ్యాల రాజులకు సంబంధించిన ఆయుధాలను కూడా మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. ఇవి తిరుమల క్షేత్రంతో ముడిపడిన చారిత్రక నేపథ్యాన్ని తెలియజేసేలా ఏర్పాటు చేశారు.

### అన్నమయ్య సంగీతానికి ప్రత్యేక స్థానం

శ్రీవారిని కీర్తించిన అన్నమాచార్యులు సహా వివిధ భక్తులు, వాగ్గేయకారులు ఉపయోగించిన సంగీత వాయిద్యాలను కూడా మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు.

శ్రీవారి భక్తి సంగీత సంప్రదాయానికి ప్రతీకలుగా వీటిని సందర్శకులకు పరిచయం చేస్తున్నారు. చరిత్రను చూపిస్తూ.. భక్తిని చాటుతూ.. సాంకేతికతతో అనుభూతిని పెంచేలా ఎస్వీ మ్యూజియాన్ని టీటీడీ తీర్చిదిద్దింది. తిరుమల క్షేత్ర వైభవాన్ని ఒకే ప్రాంగణంలో తెలుసుకునే అవకాశం కల్పించేలా ప్రదర్శనలను రూపొందించారు.

## గణేష్ పండళ్ల వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

- "గణేష్ సురక్ష సంకల్ప్ -- 2026"లో భాగంగా
- మెరుగైన భవిష్యత్తు కోసం సంకల్పం -- మాదకద్రవ్య రహిత మల్కాజ్‌గిరి



**నాచారం(ప్రశ్న న్యూస్)** పండుగ వేడుకల్లో పౌర బాధ్యతను భాగస్వామ్యం చేస్తూ, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ గణేష్ మండపాల వద్ద "గణేష్ సురక్ష సంకల్ప్ -- 2026" కార్యక్రమంలో భాగంగా సమగ్ర మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గోకుల్ నగర్‌లోని గోకుల్ నగర్ యూత్ కమిటీ వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ వెంకట రమణ హాజరయ్యారు. సీఐ ధనుంజయ గౌడ్, డీఐ వరుణ్ కాంత్ రెడ్డి, ఎస్ఐ ఫ్రాన్సిస్, ఈగల్ ఫోర్స్ ఎస్ఐలు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు గణేష్ ఉత్సవ నిర్వాహకులు, యువత, స్థానిక ప్రజలతో మాట్లాడి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మాదకద్రవ్యాల వ్యసన నివారణ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన అవసరం, అలాగే మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం గురించి అవగాహన కల్పించారు.అలాగే, మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరవేసి, మాదకద్రవ్యాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

## లోది సామాజిక వర్గం సామాజికంగా అభివృద్ధి చెందాలి

- లోది సామాజిక వర్గనికి సామాజిక వివక్ష తగదు
- తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీ రంగు
- లోది సామాజిక వర్గనికి విద్య ,ఉపాధి మార్గాలు కల్పించాలి
- అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** లోది సామాజిక వర్గ సమస్యల అధ్యయనానికి బీసీ కమిషన్ చైర్మన్ , సభ్యులు నేడు మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలోని లోది సామాజిక వర్గం కాలనీలో పర్యటించారు మెదక్ జిల్లా లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీ రంగు లతో మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పర్యటించారు.ఈ సందర్భంగా లోది సామాజిక వర్గనికి చెందిన సంఘాల ప్రతినిధులు, ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్లు, వృత్తిపరమైన అవకాశాలు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను స్వీకరించారు.లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ, ..లోది సామాజిక వర్గం ప్రజలు సామాజికంగా , ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, లోది సామాజిక వర్గం పై సామాజిక వివక్ష తగదన్నారు.క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లోది సామాజిక వర్గనికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సామాజిక--ఆర్థిక పరిస్థితులు, విద్యా మరియు ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు.ప్రజలు అందించిన వినతులు, సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, సంబంధిత అంశాలను కమిషన్ పరిధిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగిన నివేదికలు, సిఫార్సులు అందజేస్తామని తెలిపారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. లోది సామాజిక వర్గం వారు పెద్ద శంకరంపేట మండలంలోని ఆరేపల్లి ,పెద్ద శంకరంపేట్, కమలాపూర్ గ్రామాల్లో 43 కుటుంబాలకు గాను 179 మంది ఉన్నారని, రేగోడు మండలంలోని కొత్వాన్ పల్లి గ్రామంలో 19 కుటుంబాలకు 77 మంది మంది ఉన్నారని తెలిపారు.లోది సామాజిక వర్గం వారి యొక్క కుల ధృవీకరణ పత్రం తీసుకునటలో అవగాహన లేక ప్రస్తుతము వీరు ముదిరాజ్ కులంలో కుల ధృవీకరణ పత్రం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.లోది సామాజిక వర్గనికి మరిన్ని విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలని , సామాజికంగా వారిని ముందుకు తీసుకెళ్లాలని, ఎలాంటి సామాజికి వివక్ష లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ ,తహసిల్దార్ నారాయణ , ఏం పి డి ఓ క్రాంతి కుమార్, సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ ,సంబంధిత జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, లోది కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

- నీరు, గాలి, మట్టి కాలుష్యంపై శాస్త్రీయ పరీక్షలు చేయాలి: ఏనుగు సుదర్శన్ రెడ్డి



**కీసర( ప్రశ్న న్యూస్ )మేడ్చల్--మల్కాజ్‌గిరి:** జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్, చెర్లపల్లి పారిశ్రామిక ప్రాంతాల కాలుష్యంతో దమ్మాయిగూడ, నాగారం, కీసర, ఘట్కేసర్, ఎదులాబాద్ ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. నీరు, గాలి, మట్టి, పంటలు, చేపలపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి నివేదికను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతులు, మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాసంఘాలతో కలిసి ఎదులాబాద్ నుంచి జవహర్‌నగర్ వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. "ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలు గొప్పవి కావు" అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ చలపతి ప్రవీణ్ రావు, ఘట్కేసర్ డివిజన్ అధ్యక్షులు బైపాస్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజేష్, శ్రీశైలం, మల్లేష్ ముదిరాజ్, సుధాకర్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడపడితే అక్కడ బోర్లు.. భూగర్భ జలాలకు ముప్పు

- నాగారం డివిజన్‌లో విచ్చలవిడిగా బోర్‌వెల్ తవ్వకాలు
- దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు
- గుంతలు పూడ్చకుండా వదిలేస్తే చిన్నారులకు ప్రమాదం
- బోర్‌వెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఏదీ.?





**కీసర( ప్రశ్న న్యూస్)** కీసర మండలం నాగారం డివిజన్ పరిధిలో ఎక్కడపడితే అక్కడ బోర్‌వెల్‌లు తవ్వుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రిల్లింగ్ సమయంలో వెలువడే దుమ్ము, ధూళి, భారీ శబ్దంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.అదేవిధంగా విచ్చలవిడిగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగడం, నీటి మట్టాలు తగ్గడం, భవిష్యత్‌లో తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్ తవ్వకాల అనంతరం మట్టి, రాళ్లను రోడ్లపై వదిలేయడంతో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేపట్టి, అనంతరం గుంతలను సరిగా పూడ్చకుండా లేదా రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేయడం చిన్నారులు, వృద్ధులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా నివాస ప్రాంతాలు, కాలనీలు, రహదారుల సమీపంలో ఇలాంటి గుంతలు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రాకపోకలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని చెబుతున్నారు.

### రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

నాగారం డివిజన్‌లో జరుగుతున్న బోర్‌వెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు, భూగర్భ జలాల వినియోగం, పర్యావరణ నిబంధనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "ఈరోజు అవసరాల కోసం బోర్లు వేస్తున్నాం.. మరి రేపటి తరానికి భూగర్భ జలాలు మిగులుతాయా?" అంటూ నాగారం డివిజన్ వాసులు ప్రశ్నిస్తున్నారు.

## గంగపుత్రులకు విశ్వకర్మ పథకం ప్రయోజనాలు అందించాలి

- మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యకు విజ్ఞప్తి చేసిన టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభమై మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర బీజేపీ విశ్వకర్మ సెల్ రాష్ట కన్వీనర్ మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ సంప్రదాయ చేతివృత్తుల కళాకారులకు తక్కువ వడ్డీకే రుణాలు నైపుణ్య శిక్షణ ఆధునిక పనిముట్లు అందిస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఎంతో ప్రయోజనకరమన్నారు అదే విధంగా సంప్రదాయ మత్స్యకార గంగపుత్రులకు కూడా నైపుణ్య శిక్షణతో పాటు ఆర్థిక సహకారం ఆధునిక పరికరాలు, రుణ సదుపాయాలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.గంగపుత్ర మత్స్యకారుల సంక్షేమం ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డాక్టర్ బూర నర్సయ్య గౌడ్‌ను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## గణేష్ ఉత్సవాల నేపథ్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



**తార్నాక (ప్రశ్న న్యూస్)** చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి సమక్షంలో, లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి, రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రౌడీ షీటర్లకు మంచి ప్రవర్తనతో ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని, ఉత్సవాల సమయంలో ఎటువంటి అసాంఘిక లేదా నేర కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు.అలాగే గణేష్ చందా లేదా గణేష్ ఉత్సవాల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయరాదని ప్రత్యేకంగా హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా, ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు.పై సూచనలు, ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టంగా హెచ్చరించారు.

## హంస వాహనంపై జ్ఞానస్వరూపుడిగా: శ్రీవారు



**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం రాత్రి హంస వాహనసేవ వైభవంగా జరిగింది. సరస్వతి అమ్మవారి అలంకారంలో, వీణను ధరించిన శ్రీ మలయప్పస్వామివారు హంస వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.హంస వాహనంపై జ్ఞానస్వరూపుడిగా దర్శనమిచ్చిన శ్రీవారిని తిలకించేందుకు తిరుమాడ వీధులు భక్తులతో కిక్కిరిశాయి. మంగళవాయిద్యాలు, వేదఘోషలు, భక్తుల గోవింద నామస్మరణతో తిరుమల గిరులు మార్మోగాయి. వివిధ రాష్ట్రాల కళాబృందాల సంప్రదాయ నృత్యాలు, కళారూపాలు వాహనసేవకు మరింత శోభను చేకూర్చాయి.

### జ్ఞానానికి ప్రతీకగా హంస

హంసను జ్ఞానానికి, వివేకానికి ప్రతీకగా భావిస్తారు. పాలు--నీళ్లను వేరుచేసే హంస స్వభావం వివేకానికి, ఆత్మ--అనాత్మ విచక్షణకు సంకేతంగా పేర్కొంటారు. పరమాత్మ తత్వాన్ని గ్రహించిన మహనీయులను ఉపనిషత్తులు 'పరమహంసలు'గా అభివర్ణించాయి.ఈ నేపథ్యంలో హంస వాహనసేవ భక్తుల్లోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, వివేకజ్ఞానాన్ని ప్రసాదించి ఆధ్యాత్మిక ఉన్నతికి చేర్చే సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. వీణ ధరించి సరస్వతి అమ్మవారి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీవారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమలలో హంస వాహనంపై జ్ఞానస్వరూపుడిగా వెలసిన శ్రీ మలయప్పస్వామివారి దివ్యదర్శనం భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచింది.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణతో పాటు పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# 'కాటాలన్' మూవీ రివ్యూ!



మలయాళంలో రూపొందిన ఒక యాక్షన్ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీకి వచ్చింది. ఆ సినిమా పేరే 'కాటాలన్'. ఆంటోని వర్గీస్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాలో, సునీల్ .. కబీర్ దుహాన్ సింగ్ .. దుషారా విజయన్ కీలకమైన పాత్రలను పోషించారు. ఈ సినిమాకి పాల్ జార్జ్ దర్శకత్వం వహించాడు. మే 28వ తేదీన థియేటర్ లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది.'అనకొల్లి' అటవీ ప్రాంతంలో ఏనుగులు ఎక్కువగా ఉంటాయి. 'మారి' (సునీల్) చూపు ఆ అడవిపై పడుతుంది. ఏనుగు దంతాలతో అక్రమ వ్యాపారం చేయడానికి అతను ఒక అనుచర వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటాడు. పోలీసులు .. ఫారెస్టు అధికారులు తన వ్యాపారానికి అడ్డుపడకుండా వాళ్లకి పెద్దమొత్తంలో లంచాలు ముట్టజెపుతుంటాడు. ఆ చుట్టుపక్కల ఉండే గిరుజనులు తన పట్ల భయంతో బ్రతికేలా చేస్తాడు.అయితే 'ఎడ్డీ' (కబీర్ దుహాన్ సింగ్) మాత్రం 'మారి' వ్యాపారానికి అడ్డుపడుతూ ఉంటాడు. తన తండ్రిని చంపిన ఏనుగులపై కోపం ఒక పక్కన .. తన బిజినెస్ ను 'మారి దెబ్బకొడుతున్నాడనే ద్వేషం ఒక పక్కన 'ఎడ్డీ'ని బలమైన శత్రువుగా మారుస్తాయి. 'ఎడ్డీ'కి రాజకీయ నాయకులతో .. పోలీస్ అధికారులతో దగ్గర సంబంధాలు ఉండటంతో, ఒక చురుకైన అనుచరుడు కావాలనే ఉద్దేశంతో 'ఆంటోని'( ఆంటోని వర్గీస్)ను 'మారి రంగంలోకి దింపుతాడు. ఆంటోనీ వచ్చిన తరువాత 'మారి' బిజినెస్ పుంజుకోవడంతో, ఆంటోనీని అడ్డుతప్పించాలని ఎడ్డీ గ్యాంగ్ నిర్ణయించుకుంటుంది. 'మారి' కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న ఆంటోనికి, తన సహచరుడైన అలీకి జరిగిన అన్యాయం కళ్లు తెరిపిస్తుంది. 'మారి'కి ఏ మాత్రం మానవత్వం లేదని గ్రహించిన ఆంటోని, తన బృందానికి తానే నాయకుడిగా నిలబడాలని నిర్ణయించుకుంటాడు. అది పసిగట్టిన 'మారి' ఏం చేస్తాడు? అతని కారణంగా ఆంటోనికి ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? అడవిపై పెత్తనం కోసం జరిగే ఈ పోరాటంలో చివరికి గెలిచేదెవరు? అనేది కథ.'కాటాలన్' అంటే 'వేటగాడు' అని అర్థం. అడవిచుట్టూ .. అక్కడ జరిగే ఏనుగు దంతాల వ్యాపారం చుట్టూ తిరిగే కథ ఇది. అడవిలోకి రహస్యంగా ప్రవేశించి .. అక్కడి ఏనుగులను చంపేసి .. వాటి దంతాలను స్మగ్లింగ్ చేసే కథలతో గతంలో చాలానే కథలు వచ్చాయి. దాదాపు అదే లైన్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. అడవిపై ఆధిపత్యం కోసం ఇద్దరు నాయకుల మధ్య వార్ నడుస్తూ ఉంటే, ఒక సాధారణ యువకుడు వచ్చి, వాళ్లిద్దరి అటకట్టిస్తూ ఎలా ఎదిగాడనేదే ప్రధానమైన కథాంశం.'మారి' అనే వ్యక్తి తుపాకీతో గిరిజనులను భయపెట్టి .. అధికారులకు డబ్బుతో ఆశపెట్టి తన పబ్బం గడుపుకుంటూ ఉంటాడు. తన శత్రువుల ఆటకట్టించడం కోసం ఆంటోనిని చేరదీయడం .. అతని ద్వారా మరింత ఎదగడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ పరిగెడుతుంది. మారి నిజస్వరూపం తెలుసుకున్న ఆంటోని, అతని సామ్రాజ్యాన్ని కూల్చడానికి సిద్ధపడటం వంటి సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. అడవి .. ఏనుగులు .. వేట .. దంతాల తరలింపు .. చెక్ పోస్టులు .. కాల్పులు .. ఇలా ఈ కథ పరిగెడుతూ ఉంటుంది. అయితే చూస్తున్న ప్రేక్షకులకు పెద్దగా ఏమీ అనిపించదు. ఎందుకంటే ఇది రొటీన్ కథ కాబట్టి .. రొటీన్ కంటెంట్ కాబట్టి. ఇంతవరకూ వచ్చిన అన్ని కథల్లో కనిపించిన మోసాలు .. ద్వేషాలు .. వ్యూహాలనే ఈ సినిమాలోనూ చూపించారు. కథలో కాల్పులే తప్ప, ఎక్కడా కొత్తదనమనేది కనిపించదు. క్లైమాక్స్ లో మరింతగా హింసను పెంచారంతే. ఈ సినిమాలో సునీల్ పాత్ర బాగుంది. ఆయన విలన్ గా కనిపించినప్పటికీ, హీరోను డామినేట్ చేసే పాత్ర ఇది. ఆయన యాక్టింగ్ మాత్రం ఆకట్టుకుంటుంది. కబీర్ దుహాన్ సింగ్ ను కూడా బలమైన విలన్ గానే ఎత్తుకున్నారు. కానీ ఎందుకో పోను పోను ఆ పాత్రను బలహీనపరుస్తూ వెళ్లారు. దుషారా విజయన్ మంచి ఆర్టిస్ట్. కాకపోతే ఆమెను సరిగ్గా ఉపయోగించుకోలేదని అనిపిస్తుంది. ఆంటోనీ వర్గీస్ .. జగదీశ్ .. ఇలా అంతా తమ పాత్రలకు న్యాయం చేశారు.అజనీశ్ లోక్ నాథ్ – రవి బస్రూర్ సంగీతం ఫరవాలేదు. ఫారెస్టు నేపథ్యంలో లొకేషన్స్ ను తెరపైకి తీసుకొచ్చిన విధానం బాగుంది. ఎడిటింగ్ ఓ మాదిరి మార్కులనే సంపాదించుకుంటుంది.

దర్శకుడు ఈ కథను మూతా నాయకుల మధ్య ఆధిపత్య పోరుగునే చూపిస్తూ వెళ్లాడు. ఎక్కడా ఫ్యామిలీ డ్రామాగానీ .. ఎమోషన్స్ గాని లేవు. అక్కడక్కడా కాస్త కనిపించినా అవి పండలేదు. లవ్ .. రొమాన్స్ అనే మాటలకు అసలు ఛాన్సే లేదు. వ్యూహాలు .. ప్రతి వ్యూహాలు ఆసక్తికరంగా లేకపోవడం కూడా అసంతృప్తిని కలిగిస్తుంది.

# తెలుగులో మరో బంపరాఫర్

అగ్ర కథానాయిక శ్రీలీలకు వరుసగా అవకాశాలైతే వస్తున్నాయి కానీ..విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. వశిష్ట దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో లాంచ్ కానుంది.



తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి పలువురు యువ నాయికల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు శ్రీలీలను ఓకే చేశారని అంటున్నారు. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన రానుంది.

ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్ 'ఓం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అలాగే హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ చిత్రంలో నటించనుంది.

## వేగం పెంచిన రజనీకాంత్..

### 'ధర్మన్' షూటింగ్‌పై అప్‌డేట్ ఇచ్చిన దర్శకుడు



సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

## మేఘన అన్వేషణలో..

రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్సింగ్ మేఘన'. వాచస్పతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పంచుమర్తి నరేష్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దామోదర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిశోధనాత్మక కథాంశమిదని, ఆద్యంతం సస్పెన్స్‌తో ఆకట్టుకుంటుందని, కథలోని మలుపులు ఉత్కంఠను రేకెత్తిస్తాయని దర్శకుడు వాచస్పతి తెలిపారు. ఈ సినిమా ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఆర్.ఆర్.ధృవన్, నిర్మాణ సంస్థ: ఫస్ట్‌కాపీ మూవీస్, కేడీ అండ్ కో, దర్శకత్వం: వాచస్పతి



# శ్రీవిష్ణు 'ఫ్యామిలీ ప్యాక్'



శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'ఫ్యామిలీ ప్యాక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. 'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత శ్రీవిష్ణు-రామ్ అబ్బరాజు కాంబోలో వస్తున్న సినిమా ఇది కావడం విశేషం. సోమవారం ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. డబ్బు చుట్టూ నడిచే ఈ కథలో కావాల్సినంత వినోదం ఉంటుందని, ఫ్యామిలీ ఎమోషన్స్ ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. సాక్షి మథోల్కర్, నరేష్ వీకే, అభిరామి, మురళీశర్మ, అన్నపూర్ణమ్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జె.యువరాజ్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.

## అక్టోబర్ 2న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న 'అనకాపల్లి' చిత్రం!




భవ్య శ్రీ మూవీ మేకర్స్ మరియు నక్కిన నెరేటివ్స్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అనకాపల్లి' సినిమా విడుదలకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన మరియు కాండ్రేగుల నాయుడు కీలక పాత్రలు పోషిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా నిర్మించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ, కథ మరియు స్క్రీన్‌ప్లే రూపకల్పనలో తన వంతు సహకారం అందించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ మరియు పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను రాబట్టి సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా, కొద్ది రోజుల క్రితం అనకాపల్లి స్థానిక ప్రజల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రీమియర్ షోకు విశేషమైన స్పందన లభించింది. సినిమా చూసిన స్థానిక ప్రజలు చిత్ర యూనిట్‌కు బ్రహ్మరథం పట్టడంతో మేకర్స్‌లో జోష్ మరింత పెరిగింది. ఈ క్రమంలోనే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విడుదల చేసిన సరికొత్త రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరిసిటీని రెట్టింపు చేసింది. కేవలం తెలుగులోనే కాకుండా, తమిళ భాషలోనూ ఈ సినిమాను ఒకేసారి భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలైన మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ ఎల్‌ఎల్‌పి మరియు పూర్వి డిస్ట్రిబ్యూషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకువస్తున్నాయి. టెక్నికల్ పరంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కింది. మాయా.వి సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీకృష్ణ అట్టలూరి ఎడిటర్‌గా వ్యవహరించారు. విజయవంతమైన డైరెక్టర్ త్రినాథరావు నక్కిన అందించిన కథ, స్క్రీన్‌ప్లే ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనుండగా, ఉదయ్ భాగవతుల అందించిన మాటలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. దేవ్ జంద్ సంగీతం సమకూరుస్తుండగా, అనంత శ్రీరామ్, కెకె, గణేష్ సలాది, రాంబాబు గోశాల, తేజ గొర్లె వంటి ప్రముఖులు సాహిత్యమందించారు. శేఖర్ విజె, యష్ మాస్టర్, జిత్తు మాస్టర్ కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ చిత్రంలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్పలతో పాటు త్రినాథ రావు నక్కిన, ఇంద్రజ అబ్సర్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాండ్రేగుల నాయుడు, నందిని రాయ్, సంగీత క్రిష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్లపై కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా సెట్రామరాజు మల్లెల, ప్రొడక్షన్ డిజైనర్‌గా రఘు కులకర్ణి వ్యవహరించారు. పీఆర్‌ఓగా సాయి సతీష్ మరియు మార్కెటింగ్‌గా స్టార్ సర్కిల్ వ్యవహరిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2న బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# ప్యారడైజ్ బిర్యానీలా అద్భుతంగా ఉంటుంది

'నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. దర్శకనిర్మాతలు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని శాయశక్తుల కృషి చేశాను' అన్నారు సంపూర్ణేష్‌బాబు. నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్'లో బిర్యానీ అనే ఇంట్రెస్టింగ్ పాత్రలో కనిపించనున్నారు సంపూర్ణేష్‌బాబు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో తాను నాని ఫ్రెండ్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, కథాగమనంలో తన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. ఆయన మాట్లాడుతూ 'మూడు సంవత్సరాల క్రితం ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్‌లో కొన్ని మిస్టేక్స్ జరిగేవి కావు. నానిగారితో పనిచేయడం చాలా కంఫర్టబుల్‌గా అనిపించింది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా' అన్నారు. ఈ సినిమా కోసం తాను బరువు తగ్గానని, జుట్టు..గడ్డం కూడా పెంచానని సంపూర్ణేష్‌బాబు పేర్కొన్నారు. ప్యారడైజ్ బిర్యానీ ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ సినిమా అంతే అద్భుతంగా ఉంటుందని, రెమ్యునరేషన్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉన్నానని సంపూర్ణేష్‌బాబు తెలిపారు.



## వీరనారి కమలారెడ్డి

మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. బ్రిటీష్ కాలం నాటి కథాంశంతో హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ పాన్ ఇండియా చిత్రంలో సీనియర్ నటి రమ్యకృష్ణ కీలక పాత్రను పోషిస్తున్నది. మంగళవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో రమ్యకృష్ణ వీరనారి కమలా రెడ్డి పాత్రలో కనిపించనుంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో శత్రువులను తుదముట్టించి ఉగ్రరూపంలో కనిపిస్తున్నది రమ్యకృష్ణ.కథాగమనంలో కమలారెడ్డి పాత్ర కీలకంగా ఉంటుందని, ఐకానిక్ క్యారెక్టర్‌గా మిగిలిపోతుందని మేకర్స్ పేర్కొన్నారు. మరియా ర్యబోషప్క, పార్తీబన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తన్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, రచన-దర్శకత్వం: హనుమరెడ్డి యక్కంటి.



# గిరిజనుల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచింది కేసీఆరే

**- తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే..**

**- సెప్టెంబర్ 17న ప్రతి తండాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలి.**

**- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి..**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గుర్తుచేస్తూ సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలో ప్రతి తండాలో కేసీఆర్‌కు క్షీరాభిషేకంనిర్వహించాలనిపిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గిరిజనుల స్వయం పాలన కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.గిరిజనుల విద్యా, సామాజిక అభివృద్ధి కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారని గుర్తుచేశారు.గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. 10 శాతం రిజర్వేషన్ కారణంగా గిరిజన విద్యార్థులకు విద్యా రంగంలో ప్రయోజనం కలుగుతోందని, వైద్య విద్యలో ఏటా విద్యార్థులకు సీట్లు లభిస్తున్నాయని తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం కేసీఆర్ చేసిన కృషిని గుర్తుచేసుకునేందుకే సెప్టెంబర్ 17న ప్రతి తండాలో క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకే సర్పంచులుగా అవకాశం కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించారని తెలిపారు.తండాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. రోడ్లు లేని పలు తండాలకు రహదారులు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు.మెదక్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించామని గుర్తు చేశారు. నిధులు కూడా మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ఆరోపించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కేసీఆర్ హయాంలో తండాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ,ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదని, కాంగ్రెస్ నాయకుల పాలనగా మారిందని ఆరోపించారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనుల హక్కులు, సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.అనంతరరం సుల్తాన్‌పూర్ తండా సర్పంచ్ రమేష్, గిరిజన నాయకులు శ్రీను నాయక్, రంజిత్ నాయక్, ధన్ సింగ్ లు మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పాలన కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందనిఅన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచి వారి హక్కులకు గుర్తింపు కల్పించారని తెలిపారు.కేసీఆర్ హయాంలో తండాలకు పంచాయతీ హోదా కల్పించడంతో పాటు రోడ్లు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన తండాల్లో సమస్యలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు.మెదక్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేసిందని ఆరోపించారు.గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. తండాలకు గతంలో కల్పించిన మౌలిక వసతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలోని అన్ని తండాల్లో బిఆర్ఎస్ జెండాలు ఎగురవేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్,జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మెదక్ హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం అంజ గౌడ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా. నరేందర్, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,ప్రభు రెడ్డి,ఆర్కే శ్రీనివాస్,సాప సాయిలు, మార్గం. ఆంజనేయులు, శ్రీహరి, ప్రభాకర్, మంగ్యా,ఫుల్ సింగ్, ధన్ సింగ్,పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

**- రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశం**

**- పాయింట్ బుక్‌లను తనిఖీ చేసిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను ఆయన సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ప్రతి మండపం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. విధుల్లో భాగంగా సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా ఎస్పీ పరిశీలించారు. కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అవసరమైన ప్రాంతాలను పూర్తిగా కవర్ చేసే విధంగా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు.గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డియస్పి ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు





**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తిలోని బహదూర్ కరిమరిఅమ్మ ఆలయం వద్ద నందువినాయక చవితి వేడుకలు పురస్కరించుకొని శ్రీకాళహస్తిలోని బహుదూర్ పేట నందుఎం బాలసుబ్రహ్మణ్యం భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చవితి వేడుకలు పురస్కరించుకొనివినాయక చవితి వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించుకున్నారు మూడవ రోజునతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిసుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారుముందు గావిఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారుఅనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారుటిడిపి రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని బహదూర్పేట నందు కరీమారమ్మ దేవాలయం వద్ద బాలసుబ్రహ్మణ్యంభక్త బృందం ఆధ్వర్యంలో క్రిష్ణ గణపతిని కొలువు తీర్చి మూడు రోజులు గణపతి వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహించాలని తెలియజేశారు, నేడు మూడవ రోజున పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం నిమర్జనం కార్యక్రమం ఉంటుందని, ఈ నిమర్జనం కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని స్వామివారి కృప పొందవలసిందిగా తెలియజేశారు ఈ క్రిష్ణగణపతి చల్లని దీవెనలు కూటమి ప్రభుత్వంకు ఉండాలన్నారు, కూటమిప్రభుత్వంలో నేడు ప్రజలు సుఖ సంతోషాలతో సౌభాగ్యాలతో సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉండాలని తెలియజేశారు రానున్నపంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయ దుందుభి మోగిస్తుందని సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలు, జయ ,జయంతు, గున్ని, మున్నా, వీరేష్ , లయ ,జ్యోతి,సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొరను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

**- ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, గజ్వేల్‌లో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం మాట్లాడుతూ ఓజోన్ పొరను, భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.రసాయన శాస్త్ర విభాగ ఇన్‌చార్జి డా. జె. ఉమారాణి ఓజోన్ ప్రాముఖ్యత, ఓజోన్ పొర క్షీణతకు కారణాలు, దాని వల్ల మానవాళి, ఇతర జీవరాశులపై కలిగే ప్రభావాలను వివరించారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల చర్మ క్యాన్సర్, కంటి శుక్లాలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ కె. కమలా క్రిస్టియానా, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డా. పి. జ్యోతి ఓజోన్ పొర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. (ఐ క్యూ ఏ సి) కోఆర్డినేటర్ ఎం.ఎం. లక్ష్మి కార్యక్రమానికి మద్దతు అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకురాలు డా. ఆర్. సునీత న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఓజోన్ పొర, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పొందారు.

# శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆరోగ్యశ్రీ పథకంలో కొంత నిధులు దుర్వినియోగం



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి నందు దుర్వినియోగమైన నిధులపై శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా సూపర్డెంట్ మురళికృష్ణ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ పథకంలో కొంత నిధులు దుర్వినియోగం పాలయాయని ,తమకు తెలియడంతో వెలువెంటనే సమాచారాన్ని తమ శాఖ ఉన్నతాధికారులకు, మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, టూ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారని ఈ సందర్భంగా తెలియజేశారు .టూ టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ పథకంలో 42లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ మురళీకృష్ణ ఫిర్యాదు చేయడంతో ,విచారణ చేపట్టామని విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలియజేశారు, ఈ నిధులు దుర్వినియోగం అవడంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న పోస్టుమార్టం డిపార్ట్మెంట్లో పనిచేసే చందు, అనుమానితులుగా ఉన్నారని తెలియజేశారు ,వారిపై విచారణ జరుగుతున్నామని త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో రూ. 59 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, బీటీ రోడ్ ప్యాచ్ వర్క్ పనులకు ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి శంకుస్థాపన చేశారు. దబిల్ పూర్ కమాన్ వద్ద రూ. 5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులతో పాటు, నూతనకల్ వార్డు నెంబర్ 21 లో రూ. 10 లక్షలతో చేపట్టే సిసి రోడ్డు పనులను, అదే వార్డులో రూ. 10 లక్షలతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చైర్ పర్సన్ శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ఇదేవిధంగా నూతనకల్ పట్టణం వార్డు నెంబర్ 22 లో రూ. 4 లక్షలతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, ఎల్లంపేటలో రూ. 30 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ రూ. 59 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి సకాలంలో ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మేకల రజిత, మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం కింద దరఖాస్తుల స్వీకరణ

**- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీ రాణి**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకా కింద అర్హులైన నిరుద్యోగ బిసి మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి ఝాన్సీ రాణి తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తుదారు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళ అయి ఉండాలని, అత్యంత పేదలు,నిరాశ్రయులు, వితంతువులు ఒంటరి మహిళలు అనాధలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉండి ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలని, లేని పక్షంలో సంబంధిత మండల తహసిల్దార్ జారిచేసిన ఆదాయ ధ్రువీకరణ పత్ర సమర్పించాలని సూచించారు. దరఖాస్తుదారు వయసు 18 నుండి 55 సంవత్సరాలు మధ్య ఉండాలని, వయసు నిర్ధారణకు ఆధార్ లేదా ఓటర్ గుర్తింపు కార్డు సమర్పించాలని, మీ వాస్తవీకరణకు ఆధార్ కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేపడుతుందని, కుట్టు వృత్తిలో నైపుణ్య కలిగిన అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. కనీస విద్యాహరతగా ప్రాథమిక అక్షరాస్యత ఉండడం ఉత్తమమని, దరఖాస్తులు అధికంగా వచ్చిన సందర్భంలో కనీసం ఐదవ తరగతి ఉత్తీర్ణత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు ఓటర్ గుర్తింపు కార్డు తెల్ల రేషన్ కార్డు ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

## ముదిరాజ్ సంక్షేమ సంఘంమండల అధ్యక్షునిగా

# పెరుమండ్ల అంజయ్య



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ముదిరాజ్ సంక్షేమ సంఘం కోర్ కమిటీ నిర్వహించిన మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుని ఎలక్షన్లలో పెరుమండ్ల అంజయ్య విజయం సాధించారు. 15 గ్రామాల అధ్యక్షులు ఓట్లు మొత్తం 16, అందులో 12 ఓట్లు పెరుమండ్ల అంజయ్యకి పోల్ అయినవి. ప్రత్యర్థి అభ్యర్థి దండు శ్రీనివాస్ కి 4 ఓట్లు వచ్చాయి .ఎన్నికల్లో పెరుమండ్ల అంజయ్య విజయం సాధించినరు. విజయం సాధించిన వర్గం విధివిధానాలు ఏమి వెల్లడించలేదు. ఈ ఎన్నికల్లో అన్ని గ్రామాల అధ్యక్షులు, సభ్యులు, ఎలక్షన్ కోర్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 22 ఏ నిషేధిత జాబితాకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ ధర్నా

**- పాల్గొన్న పొలిట్ బ్యూరో సభ్యులు నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** 22 ఏ నిషేధిత జాబితాకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్తులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన తాము పోరాడుతామని వారు స్పష్టం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి మెమోరండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, ఎం అరవింద్ కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంటరీ అధ్యక్షుడు కందికంటి అశోక్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి సుంకర వెంకటేష్, ఇతర నాయకులు కరణం గోపి, చంద్రశేఖర్, రామకృష్ణ, తెలుగు యువత జనరల్ సెక్రటరీ నరేష్ ముదిరాజ్, జవహర్ నగర్ అధ్యక్షుడు నామాల సురేష్, వెంకటరమణ, దమ్మైగూడ అధ్యక్షుడు కృష్ణారావు, నాగారం అధ్యక్షుడు కొండ జంగారెడ్డి, నాగరాజు, తండాలపల్లి శంకర్, రాములు యాదవ్, ఉమా శంకర్ గౌడ్, కోటేశ్వరరావు, ఆశా బిందు తదిత రులు పాల్గొన్నారు.

# బోర్డుపై 24 గంటల ప్రసూతి సేవలు

## పీహెచ్‌సీలో మాత్రం 24 గంటల తాళాలే

### - స్టాఫ్ కొరతతో కుంటుపడిన వైద్య సేవలు రూ.52 లక్షల భవనాలు నిరుపయోగం







గజ్వేల్ (ప్రశ్న న్యూస్) జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. 24/7 పనిచేయాల్సిన ఆరోగ్య కేంద్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటోందని, రాత్రివేళల్లో కనీసం లైటింగ్ కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నారని, అలాగే ముగ్గురు వైద్యులు అవసరమైన చోట ఒక్క వైద్యుడే విధులు నిర్వహిస్తున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. మండలంలోని సబ్‌సెంటర్ల సందర్శనలు, సమావేశాలు తదితర బాధ్యతల కారణంగా పీహెచ్‌సీలో వైద్య సేవలకు తగినంత సమయం కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు.

#### డెలివరీలు ఎక్కడ.?

గతంలో నెలకు సగటున ఐదు వరకు ప్రసవాలు జరిగే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం ప్రసవాలు పూర్తిగా నిలిచిపోయాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. “24 గంటల ప్రసూతి సౌకర్యం” అని బోర్డు ఉన్నప్పటికీ, ఆ స్థాయిలో సేవలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

#### రూ.52 లక్షల భవనాలు.. వినియోగం శూన్యం

ప్రభుత్వ నిధులతో గతంలో సిబ్బంది నివాస భవనానికి రూ.29 లక్షలు, వైద్యాధికారి భవనానికి రూ.23 లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రస్తుతం వినియోగంలో లేకుండా తాళాలు వేసి ఉన్నాయని తెలిపారు. భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరగడంతో పాటు పీహెచ్‌సీ పరిసరాలు కూడా అపరిశుభ్రంగా మారాయని పేర్కొన్నారు. ప్రజల కోసం నిర్మించిన భవనాలు ఇలా నిరుపయోగంగా ఉండటంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.

#### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా..

గతంలో జిల్లా కలెక్టర్ పీహెచ్‌సీని సందర్శించిన సమయంలో సిబ్బంది కొరతను తన దృష్టికి తీసుకెళ్లామని సీపీఐ నాయకులు తెలిపారు. తీగుల్ పీహెచ్‌సీకి అదనంగా స్టాఫ్ నర్సులను ఏర్పాటు చేయాలని కోరగా, జిల్లాలో సిబ్బంది కొరత ఉందని కలెక్టర్ తెలిపారని పేర్కొన్నారు.

అయితే అప్పటి నుంచి పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. తీగుల్ పీహెచ్‌సీకి వెంటనే కనీసం మరో స్టాఫ్ నర్సును నియమించాలని, అదనంగా మం ో వైద్యుడిని ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లామని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పీహెచ్‌సీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, జగదేవ్‌పూర్ మండల సీపీఐ కార్యదర్శి టీ. నరసింహారెడ్డి, తీగుల్ గ్రామ శాఖ కార్యదర్శి బెల్దే భిక్షపతి, బట్టు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# చదువుకోవాల్సిన చేతులతో నీళ్లు తరలింపు

### నీళ్ల కోసం విద్యార్థుల కష్టం.. చదువును పక్కన పెట్టి నీటి కోసం శ్రమ

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ పట్టణంలోని గాంధీ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య విద్యార్థులకు ఇబ్బందిగా మారిందనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. చదువుకోవాల్సిన చిన్నారులు పాఠశాలకు అవసరమైన నీటిని తరలించేందుకు శ్రమిస్తున్న దృశ్యాలు కనిపించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### నీటి కోసం విద్యార్థులే శ్రమించాల్సిందేనా.?

పాఠశాలలో అవసరమైన నీటిని సమీపంలోని ట్యాంక్ నుంచి పైపు ద్వారా తరలించేందుకు విద్యార్థులను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాఠశాలలో తాగునీరు, పారిశుద్ధ్య అవసరాలకు సరిపడా నీటి సౌకర్యం లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు తరగతి గదుల్లో ఉండి పాఠాలు నేర్చుకోవాల్సిన సమయంలో నీటి సమస్య కారణంగా ఇతర పనుల్లో నిమగ్నం కావడం ఆందోళన కలిగించే అంశమని వారు అంటున్నారు.

#### పాఠశాలలో మౌలిక వసతులు ఎక్కడ.?

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పాఠశాలల్లో విద్యార్థులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉండాలని స్పష్టంగా పేర్కొంటోంది. నీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు ఆరోగ్యకరమైన పాఠశాల వాతావరణానికి అవసరమైనవిగా ప్రభుత్వం కూడా పేర్కొంటోంది . అయితే మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులే నీటిని తరలించాల్సిన పరిస్థితి ఉంటే, సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.

#### అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్



పాఠశాలలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు విద్యార్థులతో నీటి తరలింపు పనులు చేయిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలో అవసరమైన నీటి సౌకర్యం, తాగునీరు, పారిశుద్ధ్య వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల సమయం చదువుకే కేటాయించేలా పాఠశాల యాజమాన్యం, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి.. నీటి పైపులు కాదు

ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఏమి చెబుతారు? పాఠశాలలో నీటి సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుంది? విద్యార్థులతో నీటి తరలింపు జరుగుతోందన్న ఆరోపణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఫేక్ అధికారి.. ట్రేడ్ లైసెన్స్ పేరుతో వసూళ్లు

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఓ ఫేక్ అధికారి ఉద్దాంతం గుట్టు రట్టయింది. తను లేబర్ ఆఫీసర్ అని ట్రేడ్ లైసెన్స్ ల పేర్లతో దుకాణాలు హోటల్ నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఈ ఫేక్ అధికారి వ్యవహారం బయటపడింది. ఇతని తీరును గమనించిన స్థానికులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫేక్ అధికారి గుట్టు రట్టయింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని డబిల్ పూర్ గ్రామంలో తాను లేబర్ ఆఫీసర్ అని చెప్పుతూ స్థానిక ప్రజలను నమ్మిస్తూ ట్రేడ్ లైసెన్స్ పేరుతో స్థానిక దుకాణాలు హోటల్ నుండి అక్రమంగా డబ్బులను వసూళ్ల కు దిగాడు. అయితే సదరు వ్యక్తి ప్రవర్తన మాట తీరుపై అనుమానం వచ్చిన స్థానికులు ఐడి కార్డు చూపించాలంటూ నిలదీశారు. సదర్ వ్యక్తి చూపించిన ఐడి కార్డు నకిలీ దిగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా. నకిలీ అధికారిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు .

#### గతంలోనూ మేడ్చల్ లో సేమ్ సీన్

గతంలోనూ మేడ్చల్ లో సేమ్ సీన్ రిపీట్ అయింది. తాను జోనల్ కమిషనర్ అంటూ ఓ వ్యక్తి మేడ్చల్ లో ని కేఎల్ఆర్ వెంచర్ లో అందిన కాడికి దండుకుంటూ పోలీసులకు పట్టు పడ్డాడు. ఇతని ప్రవర్తనపై స్థానికులకు అనుమానం రావడంతో నకిలీ జోనల్ అధికారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారించగా పొట్టకూటి కోసం నకిలీ అధికారిగా అవతారమెత్తినట్లు తేలింది.

#### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. తాను అధికారిని అని చెబుతూ వసూళ్లకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు. తాను అధికారిని ఎవరు నమ్మవద్దని ఐడి కార్డును చూపించమని కోరాలని సూచించారు. సదర్ వ్యక్తిపై ఏమాత్రం అనుమానాలు ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఇలాంటి నకిలీ అధికారుల బుట్టలో పడవద్దు అని పోలీసులు కోరుతున్నారు.



## రాయవరంలో రైతన్నలకు

# కరెంట్ కష్టాలు!

### సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతుల డిమాండ్




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )రాయవరం గ్రామంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు విద్యుత్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయని పేర్కొన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాయవరం రైతులు బండి యాదయ్య, నరసింహులు, రాజలింగం చెబుతున్నారు.ఒకవైపు వర్షాలు సక్రమంగా లేక పంటల సాగుపై ఆందోళన చెందుతున్న రైతులకు, పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు.

24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా విద్యుత్ నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, సరఫరాలో అంతరాయాలను నివారించాలని కోరుతున్నారు.

# 90 మంది ఎమ్మెల్యేలు

# భూకబ్జాలకు పాల్పడ్డారు

## – బండి సంజయ్



**కరీంనగర్(ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ భూకబ్జాలపై తాను మాట్లాడిన సమయంలో తన తలను ఆరు ముక్కలు నరుకుతానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు.కేసీఆర్‌ను మెడలు వంచి బయటకు గుంజుకొచ్చింది తానేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం తమకు రావాల్సి ఉండగా తృటిలో కాంగ్రెస్ చేతికి వెళ్లిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలను బయటపెట్టడానికి రేవంత్ రెడ్డికి వెయ్యి రోజులు పట్టిందా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్య డీల్ కుదరలేదా? ఏఐసీసీకి ఈఎంఐ కట్టడం ఇబ్బందిగా ఉందా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి ఆఫర్లు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. డ్రగ్స్, ఈ-ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఏమైందని ప్రశ్నించారు. ఈ కేసులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఏం చేస్తోందో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## 40 ఏళ్ల తర్వాత మళ్లీ కనిపించిన అరుదైన చేప

### – పపువా న్యూగినియాలో వెలుగులోకి వచ్చిన స్పినాక్ పైప్‌ఫిష్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దాదాపు 40 ఏళ్లుగా కనుమరుగైపోయిందని భావించిన ఒక అరుదైన మంచినీటి చేప తిరిగి ప్రత్యక్షమైంది. శాస్త్రవేత్తలు 1985లో చివరిసారిగా గుర్తించిన ఈ ‘స్పినాక్ పైప్‌ఫిష్’ను పపువా న్యూగినియాలోని సెపిక్ నదిలో తాజాగా కనుగొన్నారు. స్థానిక ప్రజల సహకారం, వారి పరిజ్ఞానం వల్లే ఈ అరుదైన చేప ఉనికి బయటపడటం విశేషం. ఈ ఏడాది జూన్ నెలలో ఈ చేప కోసం గాలిస్తున్న పరిశోధకుల బృందం, ఫలితం లేక నిరాశతో వెనుదిరగడానికి సిద్ధమైన చివరి రోజున ఈ అద్భుతం చోటుచేసుకుంది. ఇంబండో గ్రామానికి చెందిన హెలెన్ అసు అనే స్థానిక మహిళ, రొయ్యల కోసం తన సంప్రదాయ చేతి వల ‘ఉంబెన్’తో వేటాడుతుండగా రెండు పైప్‌ఫిష్ లు చిక్కాయి. పరిశోధకురాలు జెర్రికా ఏజ్‌బిగో వాటిని ఫోటోలు తీసి నిపుణులకు పంపగా, వారు అది స్పినాక్ పైప్‌ఫిష్ అని ధ్రువీకరించారు.సముద్ర గుర్రాల జాతికి చెందిన ఈ చేప సన్నని శరీరం, పొడవాటి ముట్టెతో విభిన్నంగా ఉంటుంది. ఆకుపచ్చ-గోధుమ రంగులో ఉండటం వల్ల నది ఒడ్డున ఉండే జలచర మొక్కలలో ఇది సులభంగా కలిసిపోతుంది. సముద్ర గుర్రాల మాదిరిగానే, మగ చేపలు తమ కడుపులోని సంచిలో పిల్లలను మోయడం వీటి ప్రత్యేక లక్షణం. శాస్త్రవేత్తలు దీనిని ‘అంతరించిపోయిన చేపల’ జాబితాలో చేర్చినప్పటికీ, స్థానిక ప్రజలకు దీని ఉనికి గురించి ఎప్పటి నుంచో తెలుసు. వారు దీనిని ‘కరువెంగ్’, ‘ఇనాప్’ వంటి స్థానిక పేర్లతో పిలుచుకుంటారు. దీన్ని బట్టి, శాస్త్రీయ రికార్డులలో లేనప్పటికీ ఈ జాతి ఆ ప్రాంతంలో మనుగడ సాగిస్తోందని అర్థమవుతోంది. ప్రస్తుతం పరిశోధకులు ఈ చేపల జీవనశైలి, ఇతర అంశాలపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588